
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం
21.1.2024

# మన మహానగరం
# భాగ్యనగరం



## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**హిందువుల చిరకాల స్వప్నం అయోధ్యలోని భవ్యమైన రామమందిర నిర్మాణం ఎట్టకేలకు సాకారం కాబోతోంది. అయోధ్యలో సోమవారం నాడు రాముడి విగ్రహాన్ని గర్భాలయంలో ప్రతిష్ఠించనున్నారు. ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించన్నారు. ఇందుకోసం ఇప్పటికే సిద్ధం చేసిన రామ్ లల్లా విగ్రహం అయోధ్య చేరుకుని గర్భగుడిలోకి ప్రవేశించింది. అయితే అయోధ్యలో కొలువుదీరనున్న రాముడి విగ్రహాన్ని కొత్తగా తయారు చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఇప్పటికే అక్కడ పాత విగ్రహం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మీరేమంటారు. – వీర వెంకటరమణయ్య, విశాఖపట్నం**

మీరన్నది నిజమే రమణగారూ.... అయోధ్య రామమందిరంలో జనవరి 22న బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు సర్వం సిద్ధమైంది. ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే, అయోధ్య ప్రాణప్రతిష్ఠకు శంకరాచార్య పీఠాధిపతులు తాము హాజరుకావడం లేదని రెండు రోజుల కిందట ప్రకటించారు. దీంతో ఈ వేడుకపై రాజకీయ దుమారం రేగుతోంది. తాజాగా, శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామాజీ.. శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్‌కు గురువారం లేఖ రాశారు. కొత్త విగ్రహం ఏర్పాటు సహా అందులో పలు అంశాలను లేవనెత్తిన ఆయన.. వాటికి సమాధానం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఇప్పటికే రాముడి పాత విగ్రహం ఉండగా, మళ్లీ కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించడంతో పాటు అక్కడ ముందు నుంచే విగ్రహం ఉందనడానికి ఓ ముస్లిం వాచ్‌మన్ సాక్షిగా కూడా ఉన్నట్లు అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామాజీ. రాసిన లేఖలో అందులో పేర్కొన్నారు. 'కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే.. పాత విగ్రహం ఏమవుతుంది.. రామ్ లల్లా విరాజ్‌మన్ కోసమే కొత్త ఆలయాన్ని నిర్మిస్తున్నారని రామభక్తులు ఇప్పటి వరకూ అనుకున్నారు.. కానీ, ఇప్పుడు కొత్త విగ్రహం ఏర్పాటు చేస్తుండటంతో పాతది పక్కనబెట్టేస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.. దాన్ని పక్కన బెట్టేస్తారా? అంతేకాదు, ఆలయ నిర్మాణం పూర్తికాకుండా ప్రారంభోత్సవం ఏంటి?' అని నిలదీయటం గమనార్హం. తన ఆరు ప్రశ్నలకు ట్రస్ట్ సమాధానం ఇవ్వాలని ఆలయ ప్రాణప్రతిష్ఠ తర్వాతే అయోధ్యను తాను సందర్శిస్తానని వెల్లడించారు. కర్ణాటకలోని శృంగేరి శారదా పీఠం, గుజరాత్‌లోని ద్వారకా శారదా పీఠం, ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్ పీఠం, ఒడిశాలోని గోవర్ధన్ పీఠం శంకరాచార్యులు ప్రాణప్రతిష్ఠ వేడుకకు దూరంగా ఉంటామని ప్రకటించారు. ఈ ప్రకటనపై కేంద్ర మంత్రి నారాయణ్ రాణే స్పందిస్తూ.. ప్రతిష్ఠ వేడుకల్లో ఏవో చిన్న చిన్న లోపాలను విమర్శించకుండా అయోధ్య రామమందిరాన్ని సందర్శించాలని కోరటం ఇప్పుడు గమనించాలి మనం.

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల పాలన పూర్తి చేసుకుంది. డిసెంబర్ 7న రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత పాలనపై దృష్టి పెట్టిన సీఎం.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రెడీ అవుతున్నారు. కానీ విపక్షాలు హామీలు అమలు కాలేదంటూ అప్పుడే విమర్శలు గుప్పిస్తున్నారు. అన్నప్రసన్న నాడే ఆవకాయ అన్నం అనట్టు ఉంది వ్యవహారం. దీనిపై మీరేమంటారు సార్**
**– బడే రాజశేఖర్, హైదరాబాద్**

మీరన్నది నిజమే రాజశేఖర్ గారూ... మహిళల ఉచిత బస్సు ప్రయాణం ఆరంభించిన సిఎం రేవంత్ రెడ్డి మిగిలిన పథకాల అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియ జరుగుతుండగా.. త్వరలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మంత్రులు చెబుతున్నారు. ఇదిలా ఉండగానే.. రేవంత్ సర్కారుపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. రేవంత్ నెల రోజుల పాలనలో వైఫల్యాలే ఉన్నాయని.. రైతులకు రైతు బంధు రావటం లేదని.. ఆటో కార్మికులు రోడ్డెక్కారని ఆరోపిస్తున్నాయి. రేవంత్ పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తిలో ఉన్నాయని టం సరికాదంటూ ఓ మీడియా ప్రతినిధి రఘునందన్ చెప్పడం గమనార్హం. సీఎం రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలిచారు. ప్రతిపక్షాలు ఆరోపించేవి కరెక్టే అయినా.. ఇంకో నాలుగు సంవత్సరాల 10 నెలలు రేవంత్ రెడ్డిని ఏం చేయలేరని ఒకవేళ అటువంటి లోపాలు ఏమైనా ఉంటే.. ఆయన సరిదిద్దుకుంటాడా.. ప్రభుత్వాన్ని గాలికొదిలేస్తారా అనేది వారి విజ్ఞతకే వదిలేయని చెప్పారు. ఏది ఏమైనా.. ఇది టూ ఎర్లీ టూ కామెంట్ అని అన్నారు. నెల రోజుల్లోనే తొందరపడటం సరైంది కాదని అన్నారు. ఒక్క రోజులో ఏమీ రాదని.. ఒక్క నెల రోజుల్లో ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. ఎవరికైనా కొంత సమయమిచ్చిడాలని రఘునందన్ రావు సీఎంకు మద్దతుగా నిలిచారనిపించకడా చెప్పక తప్పదు.

## లెజెండ్

# భారత జాతీయ ఆర్మీ స్థాపకుడు మన 'నేతాజీ'



భరతజాతి ముద్దు బిడ్డ నేతాజీ సుభాస్ చంద్రబోస్ జన్మదినోత్సవాలను 23 జనవరి 2021 నుంచి "పరాక్రమ్ దివస్"గా ఘనం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ నిర్ణయించడం హర్షదాయకం. నేతాజీ జయంతిని 'దేశ్ ప్రేమ్ దివస్'గా కూడా జరుపుకునే ఆనవాయితీ గతంలో ఉండేదని మనకు తెలుసు. 126వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నేతాజీ దేశభక్తి, ధైర్యసాహసాలు, అకుంఠిత దీక్ష, నిస్వార్థ పోరాట పటిమ, వలస పాలన వ్యతిరేక ఆవేశ పోరాట పటిమను నేటి ప్రజలకు, ముఖ్యంగా యువతకు ప్రేరణగా చూపాలని భావిస్తున్నది. సుభాష్ చంద్ర బోస్ జీవితానికి సంబంధించిన రహస్య పత్రాలను ప్రజల ముందు ఉంచాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 133 ఫైల్‌లను 2015 – 16లో బహిరంగ పరచడం జరిగింది. 2019లో అండమాన్‌లోని 3 ద్వీపాలకు నేతాజీ సుభాస్ చంద్ర బోస్ ద్వీపం, షహీద్ ద్వీపం, స్వరాజ్య ద్వీపమని నామకరణం కూడా చేయడం సమంజసంగా ఉంది.

23 జనవరి 1897న కటక్‌లో ప్రభావతి, జానకినాథ్ బోస్‌లకు జన్మించిన సుభాస్ చంద్ర బోస్ విద్యాభ్యాసం కటక్, కలకత్తా (బి.ఏ. ఫిలాసఫీ), లండన్ – కేంబ్రిడ్జ్ (బి.ఏ. మెంటల్ అండ్ మోరల్ సైన్స్)ల్లో కొనసాగింది. తండ్రి ప్రోద్బలంతో లండన్‌లో ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి ఎంపికైన నేతాజీ బ్రిటీష్ ప్రభుత్వంలో పని చేయడం ఇష్టం లేక ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి మనందరికీ స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. దేశభక్తిని ఒంటి నిండా నింపుకున్న సుభాస్ చంద్ర బోస్ వలస పాలనకు వ్యతిరేకంగా 2వ ప్రపంచయుద్ధ సమయంలో నాజీ జర్మనీ, జపాన్‌ల పక్షాన నిలిచి, వారి సహాయం తీసుకోవడం జరిగింది. భారత జవాన్లు ముద్దుగా 'నేతాజీ' అని పిలవడంతో తనకు అది బిరుదులా మారి, తన పేరులో కలిసి పోయింది. కలకత్తా మేయర్‌గా (1930 – 31) సేవలు అందించిన బోస్ జాతీయ యువజన కాంగ్రేస్ అధ్యక్షుడిగా, భారత జాతీయ కాంగ్రేస్ అధ్యక్షుడిగా (1938 – 39) పని చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఉద్యమ సంస్థలతో రహస్య సంబంధాలు కలిగి ఉన్నారనే కారణంగా అనేక సార్లు అరెస్టులు కూడా అయ్యారు. 1920 – 34ల మధ్య జరిగిన భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రతో కూడిన పుస్తకం 'ది ఇండియాస్ స్ట్రగుల్' అనబడే పుస్తకం రచించారు.

మహాత్మాగాంధీతో విభేదించి కాంగ్రేస్ నుంచి బయటకు వచ్చి ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించి దాని ప్రథమ అధ్యక్షుడిగా (1939 – 41) బాధ్యతలు నిర్వహించారు. 1940లో బ్రిటీష్ ప్రభుత్వం గృహనిర్బంధం విధించిన వేళ తప్పించుకొని 1941లో జర్మనీ చేరారు. తన సహచరి ఎమిలీని వివాహమాడి కూతురికి జన్మనిచ్చారు. అడాల్ఫ్ హిట్లర్ సహాయంతో జపాన్‌కు చేరి 40,000 మంది భారతీయ యువకులతో కూడిన 'భారత జాతీయ ఆర్మీ' స్థాపించి శిక్షణను ఇచ్చారు. తన ఆర్మీతో కలిసి దేశ స్వాతంత్ర్యం కోసం 'జై హింద్' నినాదంతో సాయుధ పోరాటం చేయ సంకల్పించారు. 1944 – 45లో జరిగిన 2వ ప్రపంచ యుద్ధంలో బ్రిటీష్ ఇండియన్ ఆర్మీతో పోరాటంలో తన ఆర్మీలో సగం మంది ప్రాణాలు కోల్పోవ డం జరిగింది. రష్యాకు వెళ్లే ప్రయత్నంలో విమానం తైవాన్/తైపీ ప్రాంతంలో కూలిపోవడంతో 18 ఆగష్టు 1945న అనుమానాస్పద స్థితిలో తుది శ్వాస విడిచారు. కాని నేతాజీ అలా మరణించలేదని, తన మరణవార్త వెనుక కుట్రకోణం ఉందని గట్టిగా నమ్మేవారు కూడా ఉన్నారు. గాంధీ సమకాలీనుడైన బోస్ కొన్ని సందర్భాలలో గాంధీ చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొంటూనే, మరికొన్ని సందర్భాలలో గట్టిగా విభేధించే వారు. గాంధీ చేపట్టిన అహింసాయుత పోరాటానికి విరుద్ధంగా బోస్ సాయుధ పోరుతో స్వాతంత్ర్యం సాధించాలని గట్టిగా కోరుకున్నారు. నేటి యువశక్తిని దేశభక్తితో నింపడానికి నేతాజీ ఆదర్శ జీవితం దారి దీపం అవుతుందని నమ్ముదాం. 'మీరు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని నినదించిన నేతాజీ సుభాస్ చంద్ర బోస్ చేసిన త్యాగాలు అనన్యసామాన్యాలు, అసాధారణాలు, అనితరసాధ్యాలు, అనుసరణీయాలు. నేతాజీ జీవితం ప్రతి భారతీయ యువతీయువకులకు నిత్య ప్రేరణ ఇవ్వాలని కోరుకుందాం, 'జై హింద్' అంటూ మనసారా నినదిద్దాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## నవ కవిత్వం

### మమతల్ని కలబోసుకుంటున్నారు..



మాటలు నేర్చి..
మాటలు పేర్చి..
అవసరాలే ఆలంబనగా
మిగిలి పోతున్న ఈ కాంక్రీటు
ప్రపంచంలో..
మాటల్ని తూటాలుగా పేల్చి
మౌనమైపోతున్న ఈ స్తబ్ద
సమాజంలో..
అక్కడ వాళ్లిద్దరూ
మమతల్ని కలబోసుకుంటున్నారు..
సైగలతో..!
ఎందుకు ఆలస్యమైంది..? అన్న
సైగతో మొదలు
నిదానంగా.. నిరాటంకంగా..
పరస్పరం సైగలతో
సంభాషిస్తున్నారు..
వారి ముఖాలు నవరసాల్ని
పలికిస్తుంటే
వారిద్దరి చేతులలోని వేళ్ళు..
గాలిలో నాట్య మాడుతూంటే..
అక్కడ వాళ్లిద్దరూ
మమతల్ని కలబోసుకుంటున్నారు..
సైగలతో..!
పోనీ వారి సైగలు
ఒట్టి గాలి మెదలేనని
తీసిపారేద్దామంటే..
భాషకందని భావమేదో
వారి ఇరువురి మధ్య నదిలా
ప్రవహిస్తోంది..
మాట వినబడకుండానే
సుస్వరాల్ని ప్రతిధ్వనింపజేస్తూ..
అక్కడ వాళ్లిద్దరూ
మమతల్ని కలబోసుకుంటున్నారు..
సైగలతో..!
ఈ రణ గోన ధ్వనుల కాలుష్యంలో
పట్నం పలికే అపశ్రుతుల మధ్య
మూగ సైగలు వారిద్దరికీ
నవ్వుల నందివర్ధనాలను పూ-
యిస్తూ..
శబ్దం లేని భాషకి శ్రీకారం చుట్టి
కన్నుల్లో నిండైన భావంతో
అక్కడ వాళ్లిద్దరూ
మమతల్ని కలబోసుకుంటున్నారు..
సైగలతో..!!
(హైదరాబాదులో ఓ బస్ స్టాప్ లో
ఇద్దరు మూగ చెవిటి వారు
సైగలతో సంభాషిస్తూన్న దృశ్యాన్ని
చూసి..)

**ఏడా. వాసాల వరప్రసాద్,**
**9490189847,**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

భారతీయ ఆధునిక వైజ్ఞానిక రంగ సప్తర్షుల గురించి చాలా బాగా వివరించిన ౦ ౦ ౦ ౦ ౦ ౦ ౦ ధన్యవాదాలు. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మరచిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**


వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చుకోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**




## జీవితం



జీవితం
మనిషిని నెడుతుంటది అంథకారంలో
నిలబెడుతుంది దిక్కుతోచని స్థితిలో
మెదడు ఉండిపోతుంది
అచేతనావస్థలో


కఠిన పరిస్థితి లో
ఘోరంగా ఓడిన స్థితిలో
ముఖాన్ని నేరస్థునిలా కప్పుకోకు
అపరాధిలా తలదించుకోకు
కష్టాలకడలిలో సహనం వహించు
చిరునవ్వుతో ముందుకు సాగు


మేఘాల మాటున చిక్కిన చంద్రుడు
వెన్నెల వెలుగులు కురిపించక మానడు
తారకలు చమక్కుమని ప్రకాశించడం
ఆపవు
అంథకారం అలుముకున్న చీకటి రాత్రి
అయితేనేమి
హృదయంలో జ్యోతిని వెలిగించు

జీవితం చాలా అల్పం
జీవితం చాలా తాత్కాలికం
ఏ క్షణమైనా ముగిసిపోతుంది
మన పాత్ర జీవితపు తెరపైన కనుమ-
రుగౌతుంది
ప్రతి నిమిషము సంతోషించు
ఎదుటివారిని సంతోషంగా ఉంచు

జీవితం ఒక మలుపులో ఆగదు
ఒకొక్క మజిలి దాటుకుంటూ
ముందుకు వెళ్తుంది
ఆగిన ప్రతిచోట
నిస్తేజంగా మారిపోకు
శక్తి తెచ్చుకొని ముందుకు
స్థూలంగా జీవితపాఠమిదే
సత్యాల సారమిదే


**అరుణ డేనియల్**
**9000606889**






# సూర్య బుడత



## బాలల కథ

### తీరిన కాకి వేదన

కాకి దిగాలుగా ఉంది. అటుగా వెళు తున్న కోకిల అది గమనించి అన్నది. "కాకి బావా!ఎప్పుడు మీ వాళ్ళతో సందడి చేసే నీవు ఎందుకు ఈ రోజు దిగులుగా ఉన్నావు"

దానికి కాకి "నీకేం బావా నాలా నల్లగా ఉన్నా నీ గొంతు తీయగా ఉంటుంది.మేము మాట్లాడితే ఛీ..కాకి గోల అంటారు.పైగా నిన్ను కవులు కూడా తమ కవిత్వంలో వర్ణిస్తారు.ఆ దేవుడు నన్నిలా ఎందుకు పుట్టించాడు."అంటూ అసలు విషయం చెప్పింది.

అది విన్న కోయిల "ఏమో నాకేం తెలుసు.ఆ బ్రహ్మ దేవుడిని అడుగు" అంటూ చల్లగా జారుకుంది.

ఆ మాటకి కాకి ఇంకా దిగులు పడి పోయింది.



ఇంతలో అటుగా వచ్చిన నెమలి దిగులుగా ఉన్న కాకిని చూసి "ఏమైంది?కాకి బావా! అంతలా దిగాలు గా ఉన్నావ్"అని అడిగింది.

"ఏమని చెప్పను నెమలి బావా.నీవేమో నాట్యం బాగా చేస్తావ్! అందరూ నిన్ను మెచ్చుకుంటారు.నీ కోసం జూకొచ్చి మరీ చూస్తారు నేను ఎదురైతేనే అపశకునం ఛీఛీ అంటారు.పైగా నీ ఈక లంటే అందరికీ ఇష్టం.నా ఈకంటేనే అందరికి అసహ్యం. దేవుడు ఎందుకు నన్ను ఇలా పుట్టించాడు.నా మీదే ఎందుకు పక్షపాతం" అంటూ తన వేదనను ఏకరవు పెట్టింది కాకి.

అంతా విన్న నెమలి "ఏమో నాకేమి తెలుసు.ఆ బ్రహ్మ దేవుడిని అడుగు " అంటూ వెళ్లి పోయింది.ఆ మాటకి మరింత నీరసించి పోయింది కాకి.

ఇంతలో అటుగా వచ్చిన పావురం కాకి నీరసంగా ఉండటం గమనించి "ఏమిటి కాకి బావా!నీరసంగా ఉన్నావ్!"అని అడిగింది. "ఏమని చెప్పను పావురం బావా!నీవేమో తెల్లగా ఉంటావ్. అందరూ నిన్ను శాంతి తో పోలుస్తారు. నన్ను శని తో పోలుస్తారు.నీకు గూడు కట్టి మేత పెడతారు.నా మేతకి నేను వాలితే తరిమి కొడతారు. దేవుడు ఎందుకు నన్ను ఇలా పుట్టించాడు" అని కాకి అంది.'

'ఏమో నాకేం తెలుసు,ఆ బ్రహ్మ దేవుడిని అడుగు "అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయింది పావురం.

చివరిగాచిలుక ఎదురయ్యింది కాకికి.కాకిని చూసి ఎందుకు దిగులుగా ఉన్నావ్ అని అడిగింది చిలుక."ఏముంది! నువ్వేమో పచ్చగా ఉంటావ్. చక్కటి కబుర్లు చెపుతావ్.అందరికి జోస్యాలు కూడా చెపుతావ్. నువ్వేదైనా పండు కొరికితేచిలుక కొరికిన పండు తియ్యగా ఉంటుందని అందరు అంటారు.అదే నేను కొరికితే తరిమికొట్టి పడేస్తారు. మిమ్మల్నందరి బాగా పుట్టించి నన్నెందుకు దేవుడు ఇలా పుట్టించాడు" అని ఆవేదన వ్యక్తం చేసింది కాకి."ఏమో నాకేం తెలుసు?ఆ బ్రహ్మ దేవుడిని అడుగు " అంటూ చిలుక అక్కడి నుండి ఎగిరిపోయింది.

ఆ బ్రహ్మ దేవుడినే అడుగుదామని ఆకాశం మార్గాన బయలు దేరింది కాకి.అది గమనించిన నారద మహర్షి "ఏమిటి వాయిసమా! మా లోకానికి పయనించు చున్నావు. ఏమైనా విశేషమా?"అని అడిగాడు.

"విశేషము కాదు ముని వర్యా!నేను పడే వేదన.అన్ని జీవులకి ఏదో ఒక ప్రత్యేకత ఉన్నది.నాకే ఎటువంటి ప్రత్యేకత లేదు.అందుకే నన్ను ఇలా ఎందుకు పుట్టించావంటూ ఆ బ్రహ్మ దేవుడిని అడుగుదామని బయలు దేరాను."అని నారద మహర్షి కి తన వేదనను విన్నవించుకుంది.

అంతా విన్న నారద మహర్షి నవ్వుతూ " చూడు వాయిసమా! గత జన్మలో మనం చేసిన పాప పుణ్యాలను బట్టే ఈ జన్మలో మన పుట్టుక ఉంటుంది.నీ పుట్టుకవిశిష్టమైనది. భోజనం కు ముందు నిన్ను పిలిచి అన్నం ముద్దను పెడతారు.నీకు పెట్టడం వలన తమ పిత్రు దేవతలు సంతృప్తి చెందుతారని.అలాగే ఏ పక్షిని పిలిచి పెట్టారు కదా.నీవు శనీశ్వరుడికి వాహనం.కనుక గుడిలో నిన్ను ప్రతి ఒక్కరు మొక్కుకుంటారు .ఏ వాహనాన్ని మొక్కరు కదా.నీవు ఇంటిపైన అరిస్తే తమ ఇంటికి బంధువులు వస్తారని నమ్ముతారు.మరి ఏ పక్షి అరిచినా పట్టించుకోరు కదా.

ఎక్కువ కాలం జీవించేది నీవే.నీకు ఆహారం దొరికినా, ఏ కాకికి ఆపద వచ్చినా నీ తోటి కాకులను పిలుస్తావు.

నీ ఐకమత్యం అందరికీ ఆదర్శం. బంధాలు,సిరిసంపదలు ఏవి శాశ్వతం 'కావు,కావు' అని అరుస్తూ అందరికి బోధిస్తూ గుర్తు చేస్తుంటావు. వేకువ జామున బ్రహ్మ ముహూర్తంలో స్నానం ఆచరించే కాల జ్ఞానివి నీవు.ఇన్ని సద్గుణాలతో ఆ బ్రహ్మ దేవుడు నిన్ను పుట్టించాడు. ఇక నీకు వేదనేలా? నిశ్చింతగా జీవించు" అని అన్నాడు.

నారద మహర్షి చెప్పిందంతా విన్న కాకికి జ్ఞానోదయం అయ్యింది.ఇంత విశిష్టత గల జన్మ తనకు ఉండి కూడా ఇతరులను చూసి అనవసరంగా వేదన పడ్డానని గ్రహించి నారద మహర్షి తన కళ్ళు తెరిపించి తన వేదనను తీర్చినందుకు నమస్కరించి ఇక ఎవరితో పోల్చుకోకుండా హాయిగా జీవనం కొన సాగించింది కాకి.


**కయ్యూరు బాలసుబ్రమణ్యం**
**7780277240**


## వేమన పద్యాలు

వేరుపురుగుచేరి వృక్షంబుజెఱచును
చీడ పురుగు జేరి చెట్టుఁజెఱచుఁ
కుత్సితుండుచేరి గుణవంతుఁజెఱచురా
విశ్వదాభిరామ వినురవేమ.

చెడ్డగుణము కలిగిన వారికి ఆశ్రయమిచ్చినవారే, పురుగుకు ఆశ్రయమిచ్చిన చెట్టు మూలచ్ఛేదమగునట్లు, నాశనము పొందుదురు.

## Puzzle game







# దేవుడి భార్య



## సరికొత్త సీరియల్

(గతవారం తరువాయి)

అమ్మా ఎల్లమ్మ తల్లీ! నువ్వే అలా అంటే ఎలా తల్లి? ఊరిని కాపాడే వెయ్యి కళ్ల తల్లివి. నువ్వు తలుచుకుంటే ఏదైనా సాధ్యమే తల్లి అంటూ గుంపులో ఒక ముసలావిడ ఏడ్చింది.

అంతలోనే పూజారి టెంకాయ కొట్టాడు, హారతి పట్టాడు, నిమ్మపండును చేతికి ఇచ్చాడు. గుంపులో చాలామంది ఎల్లక్క పాదాలపై పడి మొక్కుకుంటున్నారు, ఎల్లక్క మాట్లాడుతూనే తన చేతిలో ఉన్న యాపమండల నుండి ఆకులను తుంచి అందించింది. ఎల్లక్క ఇచ్చిన యాపాకును జాగ్రత్తగా చీర కొంగులో కట్టుకున్నారు. అపురూపంగా, అమూల్యంగా, గొప్పగా, మూఢనమ్మకంగా.

ఊరికి అరిష్టం పట్టింది. కన్యపిల్లను అమ్మవారికిచ్చి పెళ్లి చేయాలి. అలా చేస్తేనే ఊరికి అరిష్టం పట్టదు, ఊరు పచ్చగా ఉంటుంది. కళకళలాడుతుంది, భూమిలో బంగారు పడుతుంది, వాగులు, వంకలు పొంగతాయి. స్త్రీజాతి రోదిస్తుందని, స్త్రీలపై శారీరక దాడి జరగబోతోందని, వివక్ష, అన్యాయం, అక్రమం జరగడానికి మూలమని ఊరి ప్రజలు కనుక్కోలేకపోయారు.

'సరే తల్లి! నువ్వు చెప్పినట్టే చేస్తాము కాని ఆ ఆడపిల్ల ఎవరో నువ్వే చెప్పు తల్లీ అన్నాడు పూజారి.' కుట్ర, పన్నాగం, మోసం, నయవంచన.

'ఎవరి గుడిసె నిప్పుతో రాజుకుంటుందో! ఆ గుడిసె ఆఖరి బిడ్డనిచ్చి నాకు పెళ్లి చేయండి. పెళ్లి చేసిన తర్వాత తను ఊరి సొత్తు అవుతుంది. ఊరిలో అందరిని సుఖపెట్టాలి. మొదటి రాత్రి గ్రామ పెద్ద కన్నెరికం చేయించాలి. నా గుడిలో పూజారి తర్వాత అంతటి హోదా తనకే దక్కుతుంది. అలా పెళ్లి చేసుకున్న ఆడపిల్ల నిత్య సుమంగళిగా ఉండటానికి దీవిస్తున్నాను. ఆమె కోసం ఊరి పెద్దలు ఇల్లు కట్టించాలి, ఆ ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉండాలి, ఇది ఆ అమ్మాయికి దక్కే అదృష్టంగా భావించాలి. ఏ ఇంటి నుండి అయితే నాకు పెళ్లి చేస్తారో ఆ ఇంటివాళ్లకు మంచి జరుగుతుందని చెప్పి కింద పడిపోయింది ఎల్లక్క.'

ఎల్లక్కను లేపి మజ్జిగ నీళ్లను ఇచ్చారు. ఆలోపే కిట్టిగాడి గుడిసెకు ఈసరయ్య మనుషులు నిప్పు పెట్టారు. స్త్రీల జీవితాలు భగ్గుమన్నది ఆ మంటల్లోనే, స్త్రీల శరీరాలను ఊరి సొత్తులుగా చేసిన మంటలు, మగవారికి బానిసలుగా చేసిన మంటలు, స్త్రీల ఆత్మగౌరవం మంటల్లో కరిగింది అక్కడే. సర్వం అక్కడే, సమస్తం అక్కడే.

"అగ్గి.. అగ్గి.. అగ్గి"

"బతుకుల్లోకి చొరబడింది, మూఢనమ్మకాల అగ్గి దహించింది, దళితుల, బీదల, అమాయకుల, అనాగరిక మహిళల జీవితాలను చిన్నాభిన్నం చేసిన అగ్గి. మహిళలను శృంగార వస్తువులుగా, వేశ్యలుగా, ఊరి సొత్తుగా, ఉంపుడుగత్తెలుగా చేసిన అగ్గి."

నడిపమ్మ ముఖంలో నవ్వులు చెదిరిపోయాయి. తనకు ఏం జరుగుతుందో? తెలియని అమాయకురాలు. దేవుడికిచ్చి పెళ్లి చేస్తారు. తాను దేవుడి భార్య అవుతుంది. దేవుడికి భార్య కావడం అంత తేలికైన విషయమా! ఎన్నో జన్మల పుణ్యం చేసుకుంటే గానీ రాదంటూ పూజారి వివరించాడు.

నడిపమ్మకు తెల్లచీర కట్టి నెత్తి మీద పసుపు నీరు పోశారు. కొప్పు నిండా పూలు తురిమారు, నుదుటిపై చారడంత బొట్టు పెట్టారు, మెడలో పూలహారం వేశారు. స్నానం చేయించిన తర్వాత ఈసరయ్య ఇంటి నుండి కొత్త చీర, గాజులు, అలంకరించుకోడానికి ఆడవారి వస్తువులు నడిపమ్మకు చేరాయి.

వాటిని అలంకరించి ఎల్లమ్మ తల్లి గుడి దగ్గరకు తెచ్చారు. ప్రాణం పోగొట్టుకోడానికి బలి పశువు, మానం పోగొట్టుకోడానికి నడిపమ్మ ఇద్దరూ ఒక్కటే. ఇద్దరికీ నోరు లేదు. బలిపశువు కనీసం తనను చంపకండని అరుస్తోంది. నడిపమ్మ నోటికి తాళాలు వేశారు.

"భక్తి తాళం, మూఢనమ్మకాల తాళం, మగ అహంకార తాళం, బీదరిక తాళం."

నడిపమ్మకు జోగుపట్టం చేసిన తర్వాత దేవుడికి భార్య అవుతుంది. డప్పులు, అరుపులు, కోలాహలం, కొత్త వింత, అమ్మవారి నామస్మరణలో ఊరి ప్రజలు. రాత్రికి ఎలా అనుభవించాలనే ఆలోచనలో ఈసరయ్య. పోతురాజు మేకపిల్ల మెడను నోటితో కొరికి నడిపమ్మ మెడలో పసుపు తాడు కట్టాడు.

నడిపమ్మ తనకు తెలియకుండానే ఊరి సొత్తు అయ్యింది. రాత్రికి ఈసరయ్యతో గడపాలని తీర్మానం జరిగింది. అందంగా అలంకరించి ఈసరయ్య దగ్గరకు పంపారు. నడిపమ్మకు ఏం అర్థం కాలేదు. నడిపమ్మ వయసు 16, మొన్నే పెద్ద మనిషి అయ్యింది. అప్పటి నుండి తల్లి ఆడుకోడానికి కూడా పంపలేదు. అలాంటిది ఇప్పుడు ఇంటిని వదిలి వెళ్ళిపోవాలని చెప్పింది. తల్లి ఎందుకు? అలా చెప్పిందో! అర్థం కాలేదు నడిపమ్మకు.

కుటుంబానికి ఎందుకు దూరం అవ్వాలి? అమ్మ, నాన్న ఉండి కూడా ఎందుకు అనాథగా బతకాలో! అన్నీ సందేహాలే. ఎవరిని అడగాలో తెలియదు. బిగుసుకుపోయి ఈసరయ్య గదిలోకి అడుగు పెట్టింది.

'భయపడకు! ఇలా వచ్చి కూర్చో. ఇప్పటినుండి నువ్వు దేవుడి భార్యవు. ఇలాంటి అవకాశం కొంతమందికే వస్తుంది. నీకు వచ్చిందంటే నువ్వు అదృష్టవంతురాలివి. ఈరోజు నన్ను సుఖపెడితే నీకు కావల్సినవి ఇస్తాను.'

'అయ్యా నేను ఇంటికి వెళ్తాను. నాకు అమ్మ కావాలి. నేను ఇక్కడ ఉండలేనని ఏడ్చింది.'

'ఇక నువ్వు అమ్మతో ఉండకూడదు. నీకు నేను గుడిసె కట్టించి ఇస్తాను. నువ్వు అక్కడే ఉండాలి. అప్పుడప్పుడు నేను అక్కడికి వస్తూ ఉంటానని చెప్పి చేయి పట్టుకున్నాడు.' కసాయి మేకపిల్ల గొంతు పట్టుకున్నట్టు.

'అయ్యా భయంగా ఉంది.. వదిలేయండి.'

'ఏం కాదు. కాసేపు ఓర్చుకో సుఖంగా ఉంటుంది. పరుపుపై తోశాడు, బట్టలు విప్పాడు, పెదవులపై ఘాట్లు, బుగ్గలు చిట్లాయి, వక్షోజాలపై పంటి ఘాట్లు, తొడల మధ్య రక్తం, శరీరం మొత్తం గోర్ల రక్కులు. పైశాచికత్వం, జింకపిల్లపై మృగం దాడి చేసింది. అది నడిపమ్మ మీద మాత్రమేనా?! సమస్త స్త్రీ జాతిపై చేసిన దాడి. తరతరాల పాటు స్త్రీ జాతిపై జరుగుతున్న శారీరక దాడి, మానసిక దాడి.' నడిపమ్మ గిలగిల కొట్టుకుంది, కసాయి మేకపిల్ల గొంతు కోసిన తర్వాత గిలగిలకొట్టుకున్నట్లు.

ఈ దాడులు ఆగాలి, మహిళలు స్వేచ్ఛా జీవులుగా బతకాలి. నాడు దేవదాసి, నేడు వేశ్య. పేరు ఏదైనా మహిళలపై శారీరక దాడులు ఆగడం లేదు. మహిళలు పోరాటాలు చేయాలి. పోరాటాలతోనే విజయాలు సాధ్యం.

రోజూలాగే తెల్లవారింది. నడిపమ్మ బతుకులోకి సూర్యుడు తొంగిచూడడు. తాను దాసీ, దేవుడికి కాదు ఈసరయ్యకు, గ్రామ పెద్దలకు, ఊరి మగవాళ్లకు. సుఖాన్ని అందించే వస్తువు, ఇప్పుడు తనను ఎవరైనా అనుభవించవచ్చు, కొట్టవచ్చు, రక్కవచ్చు, గిల్లవచ్చు, కొరకవచ్చు, బరకవచ్చు. తనపై సర్వ అధికారాలు అందరికి ఉన్నాయి.

ఏ మగాడికి దురద పెట్టినా, కొవ్వు పట్టినా నడిపమ్మ ఇంటికి వెళ్ళవచ్చు, కావాల్సింది చేయవచ్చు. నడిపమ్మ సహకరించాలి లేదంటే అమ్మవారికి కోపం వస్తుంది, ఆవేశంగా ఊగుతుంది, ఊరిని మింగుతుంది, వల్లకాడు చేస్తుంది.

'ఇంతకీ ఆమె దేవతేనా? అసలు దేవతలు ఉన్నారా? అవును ఉన్నారు పిరికివాళ్ల బుర్రల్లో, అమాయకుల జీవితాల్లో, బీదవారి బతుకుల్లో జొరబడి పీక్కు తింటున్నారు. ఇలాంటి దేవతలను, దేవతల వెనుక ఉన్న అగ్రకుల అహంకారాన్ని నడి వీధిలోకి లాగాలి. వస్తుందా ఆరోజు?! మరికొన్ని రోజుల్లోనే'.

ఈసరయ్య లేచి వెళ్ళిపోయాడు. నడిపమ్మకు లేవడం కుదరడం లేదు. శరీరం మొత్తం మెత్తగా అయిపోయింది, కందిపోయింది. మధ్యాహ్నం ఎవరో భోజనం ఇచ్చారు. తిని పడుకుంది. ఏం తిన్నదో? తెలియదు, తన శరీరం తన సోదినంలో లేదు.

రాత్రికి ఈసరయ్య మళ్ళీ వచ్చాడు. తనకు కావాల్సింది చేశాడు. నడిపమ్మ ఇష్టంతో కాని, బాధతో కాని తనకు సంబంధం లేనట్లుగా తనను కొద్ది కొద్దిగా మింగి, ఊంచి మూలన పడేసి వెళ్ళాడు. మూడు రోజుల పాటు ఇదే తంతు. ఆ తర్వాత ఊరి చివర ఒక గుడిసెలో నడిపమ్మను పెట్టారు.

లిలిలి

గాయమైన చోట ఎక్కువగా నొప్పి పెడుతుంది. ఆ తర్వాత గాయానికి అలవాటు పడుతుంది శరీరం. గాయం నుండి బాధ, నొప్పి, కష్టం ఎన్ని ఉన్నా ఒకసారి గాయమైన తర్వాత కొంత కాలం పాటు అన్నింటినీ అంగీకరించాల్సిందే.

శరీరానికైన గాయం అయితే సరే మరి మనసుకైన గాయం సంగతి ఎలా? జీవితానికైన గాయం సంగతి ఎలా? స్త్రీ జాతికైన గాయం సంగతి ఎలా? ఎవరు మాన్పుతారు? ఎవరు రూపుమాపుతారు? మౌనం గాయాలను నయం చేస్తుందా? ఎంతమంది ఆడవాళ్ల గుండెల్లో గాయాల కుంపట్లు ఉన్నాయో!.

నడిపమ్మ తన మనసుకైన గాయాన్ని మర్చిపోలేదు. గాయం సలుపుతూనే ఉంది. అయినా మగవాళ్లకు సహకరించాల్సిందే, తన శరీరాన్ని అప్పగించాల్సిందే. ఎవరో ఇద్దరు మగాళ్లు వెళ్లారు. కుక్కకు బిస్కట్లు వేసినట్లు బిర్యానీ వేశారు. బిర్యానీ తిన్న తర్వాత నడిపమ్మ జుట్టును పట్టుకొని లాగారు, చెంపలను కొరికారు, తొడలపై గుద్దారు, కడుపుపై తన్నారు.

గట్టి గట్టిగా కేకలు పెట్టింది. అయినా ఆ గుడిసె వైపు ఎవరూ వెళ్ళలేదు, అరవడం సహజం, అరిస్తేనే నడిపమ్మ బతికుందని అర్థం. అరుపులు విన్న మగాళ్లు నడిపమ్మను అనుభవించవచ్చని, ఆరగించవచ్చని సంబరపడతారు. నడిపమ్మ బాధ, నొప్పి, కేకలు, ఆర్తనాదాలే ఊరి మగ పురుగులకు ఆహ్వానాలు. నడిపమ్మను అనుభవించడానికి వెళ్ళినవారు కొడతారు, తిడతారు, తంతారు, ఈడుస్తారు, బరుకుతారు, రక్కుతారు, గుద్దుతారు, పొడుస్తారు.

అలా చేయాలి, చేస్తేనే నడిపమ్మ అరుస్తుంది, ఏడుస్తుంది. ఆ ఏడుపులే మగాళ్లకు సుఖం, ఆనందం, ఇంపు.

ఒకడు నడిపమ్మ నోట్లో నాటు సారా పోశాడు, మరొకడు ముఖంపై ఉమ్మినాడు. ఒకడు నడిపమ్మ శరీరంపై ఉచ్చలు పోశాడు, మరొకడు మర్మాంగాన్ని చరిచాడు, కొరికాడు. అది మగవారి సరదా, దురద, కొవ్వు, మదం. కొంత మంది మగవాళ్లకు ఆడోళ్లు బానిసలు, ఆట వస్తువులు, శృంగార బొమ్మలు. పెనుతుఫాను వరిపంటను అతలాకుతలం చేసినట్టు, పిల్ల కాలువలోని పడవలను ఎవరో అకారణంగా తొక్కినట్టు నడిపమ్మను ఊరి మగవాళ్లు అనుభవించారు, అనుభవిస్తున్నారు, ఈ గొడ్డు లోకం కళ్ళు తెరిచే వరకు.

తెల్లారే కల్ల లేచి, తల స్నానం చేసి గుడికి వెళ్ళాలి. గుడిలో పూజారి పెట్టే ప్రసాదం తినాలి. ఇంటింటికి వెళ్లి అడుక్కోవాలి. అలా అడుక్కునే సమయంలో సోడాల ఈరయ్య రాత్రికి సిద్ధంగా ఉండమని కన్ను కొట్టాడు. మిద్దె మురళి మీసం మెలేసి, కొత్త చీర ఇసిరి కొట్టి బాగా స్నానం చేసి ఈ సీర కట్టుకో ఒక పట్టు పడదాము అన్నాడు. పర్వతాల నాయుడప్ప పంచెను తొడలపైకెత్తి, యాభై రూపాయలు చేతిలో పెట్టి సాయంత్రం మంచం ఎక్కుదాం అన్నాడు. అన్నం కోసం, పొట్ట నింపుకోవడం కోసం ఇళ్ల దగ్గరకు నడిపమ్మ అడుక్కోడానికి వెళ్తే మగ పురుగులు వంతులు వంతులుగా వాళ్ల కామాన్ని తీర్చుకోడానికి వస్తువుగా, లంజగా చూశారు.

పేరుకే దేవుడితో పెళ్లి జరిగింది కాని మంచి దృష్టితో చూసే మనిషే లేదు. తన బాధను దేవుడితో చెప్పుకుందామంటే లాభం లేదు. దేవుడి పేరుతో జరిగే మోసంలో, అన్యాయంలో, అక్రమంలో దేవుడు కూడా ఒక భాగస్వామే అనుకుంది.

రోజుకు ఎంతమంది వెళ్తారో తెలియదు. రకరకాల కామాంధులు, రకరకాల కోరికలతో నడిపమ్మను చిత్రహింసలు పెడతారు. తనకు ఇష్టం లేనివి, చేయలేనివి చేయమనేవారు. ఇంట్లో భార్య సరిగా చేయడం లేదు నువ్వు కూడా చేయకపోతే ఎలా? గొంతులో ఏం పెట్టుకున్నావే అంటాడు ఒకడు, నాకు పెళ్లి కుదిరింది ఎలా చేయాలో? ఏం చేయాలో? తెలియదని మరొకడు. ఊళ్లోని మగవాళ్లంతా నడిపమ్మ గడప తొక్కిన వాళ్లే. ఊళ్లో ఉన్న గుడి కంటే నడిపమ్మ గుడిసెకే ఎక్కువ మంది వెళ్లడం మొదలైంది.

బాగా అలసిపోయి పడుకున్న నడిపమ్మ గుడిసెలోకి 15 ఏళ్ల చిన్నడు వెళ్ళాడు.

'ఏందిరా ఇట్టా వచ్చినావు?'

'నీ కోసమే'

'ఏం కావాలి?'

'మా నాయనతో, మా అన్నతో చేసినావే! అదే కావాలి.'

'ముండాకొడకా! ఏం మాట్లాడతాండావు గుడిసె దాటు ముందు.'

'జేబిలో నుండి డబ్బు తీసి ముఖం మీద కొట్టి నీకు కావాల్సింది ఇదే కదా! మా నాయన కన్నా, మా అన్న కన్నా నేనే ఎక్కువ డబ్బు ఇచ్చినా బట్టలు ఇప్పు. నువ్వు ఎవరితోనైనా చేయచ్చని మా నాయన చెప్పినాడు.'

'పక్కనే ఉన్న సంగటి కట్టె తీసుకొని కొట్టబోయింది.'

'ఏమే లంజా? అని అదే సంగటి కట్టె తీసుకొని నెత్తి మీద కొట్టాడు.'

నడిపమ్మ నెత్తి నుండి రక్తం, కళ్ళు బైర్లు కమ్మాయి, తూలి కిందపడిపోయింది. కొద్దిసేపటి తర్వాత నడిపమ్మ తొడల మధ్య నుండి రక్తం. తన రక్తంలో తానే నానింది, మునిగింది, తడిసింది. తల నుండి రక్తం, తొడల మధ్య నుండి రక్తం, పాలిండ్ల నుండి రక్తం, శరీరం మొత్తం రక్తం.. రక్తం.. రక్తం.

నడిపమ్మ పాలిండ్లను, మర్మాంగాన్ని, పిరుదులను చిన్నడు కొరికాడు, పంటిగాట్లు పెట్టాడు, పాలిండ్ల మీద బరికాడు. అది తన తండ్రి నుండి, అన్న నుండి నేర్చుకున్నాడు. స్త్రీతో సుఖం పొందాలంటే అలా చేయాలనీ, అలా చేస్తేనే మగతనం అని, స్త్రీ ఎంత గట్టిగా అరిస్తే, బాధపడితే అంతటి మగాణ్ణి అని నమ్మాడు.

ఆ విషయాన్ని మరుసటి రోజు పంచాయితీలో పెట్టింది నడిపమ్మ. పంచాయితీ పెద్దలు చిన్నడిని మెచ్చుకున్నారు, చిన్నోడివే కాని నీ దగ్గర మాంచి విషయం ఉందిరా అన్నారు. అభినందించారు, చిన్నడు చేసిన దానిలో తప్పు లేదని తీర్మానించారు.

పిల్లగానికి తెలియకపోతే నేర్పించాలి కాని వాన్ని భయపెట్టితే ఎలా? అందుకే కొట్టినాడని నడిపమ్మను కసిరారు. ఉన్మాదులు, కామాంధులు, వావి వరసలు లేని కుక్కలు, మృగాలు ఛీ ఛీ.. అంతకంటే హీనం.

నెత్తికైన గాయానికి మందు కోసం ఆచారి దగ్గరకు వెళ్ళింది. నెత్తికి కట్టు కట్టి, పాలిండ్ల మీద, మర్మాంగం మీద, పిరుదుల మీద మందు పూశాడు. పది రోజుల పాటు ఎవరినీ రానియ్యద్దు. మీ అమ్మగారు బిడ్డ కాన్పు కోసం పక్క ఊరికి పోయింది, 15 రోజులు రాదు.



రచన : జానీ తక్కెడసిలా
7259511956

# పాతబట్టలు పారేయకుండా ఇలా కొత్తగా వాడండి..

**ప్రతి పండుగ, ఫంక్షన్‌కి కొత్త బట్టలు వేసుకుంటారు. కొత్త బట్టల్ని కొన్నప్పుడు వాటిని ఎక్కువ రోజులు వాడాకా పాతగా మారతాయి. దాంతో వాటిని వేసుకోవాలనిపించదు. అలాంటప్పుడు కొన్నిసార్లు వేరేవారికి ఇస్తారు. అది కావంటే వాటిని ఇంట్లోనే తిరిగి వాడేందుకు కొన్ని ఐడియాస్ ఉన్నాయి. అవేంటంటే..**



## కవర్స్, కర్టెన్స్..



చీరల్ని వాడి మనం కర్టెన్స్‌లా కూడా చేయొచ్చు. లేదంటే సోఫా కవర్‌లా కూడా కుట్టొచ్చు. ఇలా కాకుండా మీ ఇంట్లోని షెల్ఫ్‌లు, ఏవైనా పాత బుక్స్‌ని కవర్ చేసే కవర్స్‌లా కూడా చేయొచ్చు. అంతే కాకుండా వీటిని సంచుల్లా కుట్టొచ్చు. వీటితో వెజిటేబుల్స్ కూరగాయలు, సరుకులు తెచ్చుకోవడానికి వాడొచ్చు. అంతేకాకుండా వ్యాలెట్‌లా కూడా వాడొచ్చు. పాత చీరల్ని కొత్తగా లెహంగాస్, డ్రెస్సెస్‌లా కుట్టించుకోవచ్చు. చక్కగా పెద్ద డ్రెస్సెస్ వస్తుంటాయి. వీటిని బ్లౌజెస్‌లా కూడా కుట్టొచ్చు.

## క్రియేటివిటీగా..



పాత బట్టలు పారేసే బదులు వాటిని క్రియేటివిటీగా ఏమైనా చేయొచ్చు. ఫ్యాబ్రిక్ ఏదైనా రంగు మార్చొచ్చు. పిల్లో కవర్స్‌లా చేయొచ్చు. లేదా ఎంబ్రాయిడరీ, మిర్రర్ వర్క్ వేసి ఫ్యాబ్రిక్ పెయింట్ వేయొచ్చు. దీనికి మీ క్రియేటివిటీని యాడ్ చేస్తే అవి చక్కగా కనిపిస్తాయి. వాటిని చక్కగా ఫ్రేమ్‌లా చేయొచ్చు.

## రంగుపోతే..

కొన్ని బట్టలు క్లాత్ బానే ఉంటుంది. రంగు మాత్రమే పోతుంది. అలాంటప్పుడు వాటికి మళ్ళీ డై వేయించొచ్చు. దీని వల్ల పాత బట్టలు కొత్తవాటిలా మారతాయి. దీనికోసం మీరు మంచి బొటిక్‌ని సెలక్ట్ చేసుకుని మీకు ఎలా కావాలో వారికి ఎక్స్‌ప్లెయిన్ చేయండి.





# కళ్లపై ఒత్తిడి తగ్గించే.. ఆయుర్వేద మూలికలు

## త్రిఫల..

త్రిఫలాలు అంటే.. ఉసిరికాయ, తానికాయ, కరక్కాయ. వీటితో చేసిన చూర్ణం మనకి మార్కెట్‌లో దొరుకుతుంది. ఇది కళ్లను శుభ్రపరచడానికి, శరీరంలో మంటను తగ్గించడానికి, కంటి కండరాలను సడలించడానికి సహాయపడుతుంది. అంతేకాదు, ఫ్రీ రాడికల్స్ నుంచి కంటి కణాలను రక్షిస్తుంది. దీన్ని గోరువెచ్చని నీళ్లలో మిక్స్ చేసి తాగినా, నీళ్లలో త్రిఫల పొడి మిక్స్ చేసి తాగినా.. కళ్లకు ఉపశమనం లభిస్తుంది.

## కలబంద..

కలబందలో శీతలీకరణ గుణాలు ఉంటాయి, ఇవి కంటిని రిలాక్స్ చేస్తాయి. కలబంద గుజ్జు కంటి ఒత్తిడిని దూరం చేస్తాయి. కలబంద గుజ్జును కళ్ల చుట్టూ అప్లై చేసి.. 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత దీన్ని సున్నితంగా శుభ్రం చేసుకోవాలి.

## రోజ్ వాటర్..

కళ్లకు రోజ్ వాటర్ అప్లై చేయడం వల్ల అవి రిఫ్రెష్ అవుతాయి. రోజ్ వాటర్ కళ్లను రియాక్టివేట్ చేస్తుంది. కంటి ఒత్తిడిని దూరం చేయడానికి, కాటన్ ప్యాడ్‌లను రోజ్ వాటర్‌లో ముంచి.. కళ్లపై 10 నుంచి 15 నిమిషాల పాటు ఉంచండి. ఇలా రోజూ నిద్రపోయే ముందు చేస్తే.. కళ్లు రిలాక్స్ అవుతాయి.



## కీరా దోస..

కీరా దోసలో శీతలీకరణ ప్రభావాలు ఉంటాయి. ఇవి కంటి ఒత్తిడిని తగ్గిస్తాయి. దోసకాయ ముక్కలను కళ్లపై 10 – 15 నిమిషాలు పెట్టి ఉంచుకోవాలి.

## ఉసిరికాయ..

ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడతాయి. ఉసిరికాయ తీసుకుంటే.. కంటి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

## సోంపు..

సోంపు గింజలు కళ్లకు ఒదార్పును ఇస్తాయి, కంటి ఒత్తిడిని తగ్గిస్తాయి. సోంపు గింజలను పొడి చేసి వేడి నీళ్లలో వేసుకుని తాగితే.. కళ్ల ఒత్తిడి తగ్గుతుంది.

## నెయ్యి

పడుకునే ముందు కొన్ని చుక్కల వెచ్చని, క్లియర్ చేసిన నెయ్యిని.. కళ్లకు అప్లై చేస్తే.. కంటి ఒత్తిడి, కళ్లు పొడిబారడం వంటి సమస్యలు దూరం అవుతాయి.

## బ్రహ్మి..

బ్రహ్మిని మొన్నీరి అని కూడా పిలుస్తుంటారు. ఇది కంటి ఒత్తిడిని తగ్గించడానికి, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది. వేడి నీళ్లలో మిక్స్ చేసి తాగితే.. కంటి ఆరోగ్యానికి మంచిది.





# మన మహానగరం భాగ్యనగరం

**తెలంగాణ రాష్ట్ర రాజధాని, గతంలో ఆంధ్ర ప్రదేశ్ రాజధాని హైదరాబాద్. మినీ భారతం విశ్వనగరంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. హైదరాబాద్ కు మరోపేరు భాగ్య నగరం. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలుగా ఎంతో ప్రసిద్ధి చెందాయి. హైద్రాబాద్ లో మనం పిల్చుకునే ఆ ఏరియాలకు ఆ పేర్లు ఎలా వచ్చాయో దాని చరిత్రేంటో తెలుసుకుందాం.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంను నాలుగు జిల్లాల్లో విభజించనున్నట్లు ప్రకటించడంతో హైదరాబాద్ మీద అవగాహన కోసం ఈ వ్యాసం**


హైదరాబాద్ కు 13 దర్వజాలు,26 కిటికీలు అనేక బురుజులు పురానాపూల్,గొల్ల కిడికి,పేట్ల బురుజులు ఈ విధంగా ఎన్నో ఉండేవి.వాటికి వాచ్ టవర్స్ దానికి కాపలా దారులుగా కౌస్ దార్, ఫౌజ్ దార్ లు ఉండేవారు.దేవిబాగ్, జాం బాగ్,సఫోట బాగ్,బాగే ఆమ్, బాగ్ లింగం పల్లి,ఈ విధంగా అనేక ఉద్యానవనాలు, అనేక బావులు, చెరువులు, కాలువలు, గుంతలు ఉండేవి.హైదరాబాద్ లోని అనేక ప్రాంతాల్లో పెద్ద పెద్ద సఫోట చెట్లు, మామిడి చెట్లు,జామ చెట్లు, కూరగాయలు, వ్యవసాయం ఉండేది. హైదరాబాద్ లో అప్పటి నుంచి హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ మతాల ప్రజలు వారి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన మందిరాలు ఉండేవి ప్రస్తుతం ఉన్నాయి.అన్ని కులాల వారు, మతాల వారు కలిసి మెలిసి సమైక్య కుటుంబ సభ్యులుగా ఉండేవారు. హైదరాబాద్ నామౌచిత్యం గురించి తెలుసు కోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.హైదరాబాద్ బిర్యానీ ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.మొఘలుల, అరేబియన్ వంటలకు హైదరాబాద్ ప్రముఖ స్థానం సంపాదించుకుంది. చార్మినార్ సమీపంలో చార్ కమాన్ లో గాజులు,ఈతర్ లు,షేర్వానీ, బురఖా లు,ఇతర పట్టు చీరలు అలంకరణ వస్తువులు అందరికీ అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నాయి. హైదరాబాద్ బొల్లారం లో రాష్ట్రపతి విడిది గృహం ఉంది. హైద్రాబాద్ ను చాలా ఏళ్ల పాటు కుతుబ్ షాహీలు, నిజాం రాజులు పరిపాలించడంతో ఇక్కడి ప్రాంతాలకు వాళ్లకు సంబంధించిన పేర్లు కనిపిస్తుంటాయి.!

### 1. బేగంపేట్




6వ నిజాం మహబూబ్ అలీఖాన్ తన కుమార్తె బషీర్ ఉన్నిసా బేగం ను ఉమ్రన్ అమిర్ కు ఇచ్చి పెళ్లి చేశాడు.. కూతురికి కట్నం కింద ఒక స్థలాన్ని కట్నంగా ఇచ్చాడు. ఆ స్థలానికి బషీర్ ఉన్నిసా బేగం పేరు మీదగా బేగంపేట అని పేరు వచ్చింది.

### 2. చార్మినార్



కులికుతుబ్ షా కట్టిన ఈ కట్టడానికి ప్రధాన ఆకర్షణ నాలుగు స్థంబాలుఉర్దూలో చార్ అంటే నాలుగు, మినార్ అంటే స్థంబాలు వీటి పేరు మీదుగానే చార్ మినార్ అనే పేరు వచ్చింది!

### 3. సికింద్రాబాద్



మూడో నిజాం సికిందర్ ఝా పేరు మీద ఈ ప్రాంతానికి సికింద్రాబాద్ అనే పేరు వచ్చింది . అంతకుముందు సికింద్రాబాద్ ని లష్కర్ అని పిలిచే వారు.

**(మిగతా 8వ పేజీలో)**

### 4. ఖైరతాబాద్



ఇబ్రహీం కుతుబ్ షా తన కుమార్తె ఖైరున్నీసా బేగానికి ఇచ్చిన జాగీరు కాలక్రమేణా ఖైరతాబాద్ గా మారింది.

### 5. శంషాబాద్



షమ్స్-ఉల్-ఉమ్రా అనే పేరు మీద శంషాబాద్ అనే పేరు వచ్చింది. షమ్స్ అంటే సూర్యుడు. దీని అర్థం ప్రభువుల యందు సూర్యుడిలాంటి వాడనిఈ బిరుదు నవాబ్ మొయిన్-ఉద్-దౌలా బహదూర్ కు కలదు.!



### 6. నాంపల్లి

నిజాం నవాబు దగ్గర పనిచేసిన రజా అలీ ఖాన్ అనే దివాన్‌కు నెఖ్ నామ్ ఖాన్ అనే బిరుదు ఉండేది. నవాబు ఆయనకు కొంత భూమిని దానంగా ఇచ్చాడు. ఆ ప్రాంతాన్ని మొదట్లో నెఖ్- నామ్- పల్లిగా పిలిచేవారు. ఇప్పుడది నాంపల్లిగా మారిపోయింది.

### 7. హిమయత్ నగర్



1933 లో ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ యొక్క పెద్ద కుమారుడు హిమాయత్ అలీ ఖాన్ ఆసఫ్ జా పేరు మీద ఆ స్థలానికి హిమాయత్ నగర్ అని పేరు వచ్చింది.

### 8. అబిడ్స్




Figure 1. Albert Abid, Deen Dayal, c1900
Courtesy Narendra Luther

ఆరో నిజాం కాలంలో అల్‌బర్ట్ అబిడ్ అనే ఒక ఆర్మేనియా యూదువ్యాపారి ప్యాలెస్ టాకీస్ దగ్గర ఓ షాప్ పెట్టుకున్నాడు. దానికి అబిడ్ అండ్ కంపెనీ అనే పేరు పెట్టాడు. తర్వాత కొంతకాలానికి ఆల్బర్ట్ అబిడ్ ఇంగ్లాండ్ కి వెళ్లిపోయినప్పటికీ ఆ స్థలానికి ఆ పేరే స్థిరపడిపోయింది!కాలక్రమంలో ఆ ప్రాంతం కాస్తా అబిడ్స్ గా మారిపోయింది.

### 9. సోమాజిగూడ



నిజాం కాలంలోని రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారైన సోనాజీకి కొన్ని భూములుండేవి . సోనాజీ కాస్త సోమాజి అయింది. గూడ అంటే చిన్న గూడెం లేదా ప్రాంతం అని అర్థం. రెండు కలిపి సోమాజిగూడ అయ్యింది.



### 10. మాసబ్ ట్యాంక్



6వ కుతుబ్ షాహ్ భార్య హయత్ భక్షిభేగంను మాసా హెబా అని పిలిచేవారు. మాసా హెబా పల్లె భూములకు సాగు నీరు ఇవ్వడానికి ఒక ట్యాంక్ నిర్మించింది . ఆ ట్యాంక్ పేరు మాసాహెబా తలాబ్ అని పిలిచేవారు . చివరకు ఆ పేరు మాసబ్ ట్యాంక్ అయింది .

### 11. హైదరాబాద్



కులీకుతుబ్ షా భార్య భాగమతి వివాహం తర్వాత తన పేరుని హైదర్ మహల్ గా మార్చుకున్నారు. హైదర్ మహల్ అంటే హైద్రా నగరం అని అర్థం తర్వాత ఆ పేరు మీద హైదరాబాద్ గా మారింది .

### 12. మలక్ పేట్



గోల్కొండ రాజు అబ్దుల్ కుతుబ్ షా యొక్క సేవకుడు మాలిక్ యాకుబ్ పేరు మీదగా ఈ ప్రదేశానికి మలక్ పేట్ అనే పేరు వచ్చింది.

### 13. బషీర్ బాగ్



బసిరుద్దౌలాకు హైద్రాబాద్ లో ఒక ప్యాలెస్ ఉండేది ఆ ప్యాలెస్ దగ్గర పెద్ద గార్డెన్ ది . బసిరుద్దౌలా పేరు మీద ఆ ప్రదేశానికి బషీర్ బాగ్ అనే పేరు వచ్చింది. బాగ్ అంటే గార్డెన్ అని అర్థం .

### 14. ఫలక్ నుమా



ఫలక్ అంటే ఆకాశం , నామ అంటే అద్దం . ఈ ప్రదేశం అంతా కొండలతో ఎంతో ఎత్తుగా ఉండేది . కాబట్టి ఆకాశానికి అద్దం అనే అర్థం వచ్చేలా ఫలక్ నామ అని పేరు పెట్టారు . ఫలక్ నామ కాస్త ఫలక్ నుమా అయ్యింది!

### 15. సరూర్ నగర్



రెండో నిజాం అలీ ఖాన్ హయాంలో ప్రధాని పనిచేసిన నవాబ్ అరస్తు ఝా బహదూర్ భార్య సరూర్ అఫ్జా బాయికి చార్మినార్‌కు 4 మైళ్ల దూరంలో రాజు కొంత స్థలాన్ని రాసిచ్చాడు. ప్రస్తుతం సరూర్ నగర్ అని పిలిచే ఆ ఏరియా సరూర్ అఫ్జాబాయి పేరుమీదనే స్థిరపడింది.

### 16. లంగర్ హౌజ్



గోల్కొండ నవాబుల కాలంలో సైనికుల భోజనం కోసం ఏర్పాటు చేసిన లంగర్ ఖానా కాలక్రమేణా లంగర్ హౌజ్ మారింది. గోల్కొండ నుంచి సైనికులు ఇక్కడికి వచ్చి భోజనాలు చేసి వెళ్లేవారు.

### 17. చెంచల్ గూడ




చిచ్‌లం అనే బంజారా తెగ ఉండే ఏరియా కాలక్రమంలో చెంచల్ గూడగా మారింది. ఇక్కడే భాగమతి కూడా నివాసం ఉండేదని చరిత్రకారులు చెప్తుంటారు.

### 18. కార్వాన్



ఒకప్పుడు సాహుకారి కార్వా అని పిలిచే ప్రాంతాన్ని నేడు కార్వాన్ అని పిలుస్తున్నారు. కోహినూర్ వజ్రాన్ని సానపట్టింది ఇక్కడే అని చెప్పుకుంటారు. వజ్రాలు, ముత్యాల వ్యాపారస్థుల సమూహంగా చరిత్రలో ఒక వెలుగు వెలిగిన ప్రాంతం కార్వాన్.

### 19. కవాడిగూడ



ట్యాంక్ బండ్ నిర్మాణానికి కావడిలో రాళ్లు మోసిన కూలీలు అక్కడే గుడిసెలు వేసుకుని నివసించేవారు. అప్పట్లో ఆ ప్రాంతాన్ని కావడీల గూడెం అని పిలిచేవారు..

(మిగతా 9వ పేజీలో)

క్రమంగా ఆ ఏరియా కవాడిగూడగా మారింది.

**20. దోమలగూడ :** దోమలగూడ అసలు పేరు దో మల్ గూడ! పూర్వం ఇద్దరు మల్ల యోధులు అక్కడ ఉండేవారు. వారిపేరుమీదనే ఆ ఏరియాను దో మల్ గూడ అని పిలిచేవారు. కాలక్రమంలో అది దోమలగూడగా మారింది.

**21. బేగం బజారు :** హైదరాబాద్ వ్యాపారులపై దయతో నిజాం సతీమణి హందాబేగం ఓ ప్రాంతాన్ని రాసిచ్చేసింది. అది కాలక్రమంలో బేగం బజారుగా నిలిచిపోయింది.

**22. అఫ్జల్ గంజ్ :** ఐదో నిజాం అఫ్జల్ ఉద్దౌలా ధాన్యం గింజల వ్యాపారులకు బహుమతిగా ఇచ్చిన భూమి కాలక్రమేణా అఫ్జల్ గంజ్ గా మారింది

**23. హైదర్ గూడ :** మొదటి తాలుఖ్ దార్( జిల్లా కలెక్టర్) హైదర్ అలీ పేరుతో హైదర్ గూడ ఏర్పడింది.

**24. తార్నాక :** తార్నాక అసలు పేరు తార్ నాకా! తార్ అంటే ముళ్లకంచె.. నాకా అంటే పోలీస్ ఔట్ పోస్టు. నిజాం ప్రభుత్వంలోని ఓ ఉన్నతాధికారికి ఉస్మానియా యూనివర్శిటీ దగ్గరలో తోట ఉండేది. దాని చుట్టూ ముళ్లకంచె, ముందొక పోలీస్ ఔట్ పోస్టు ఉండేది. అందుకే ఆ ఏరియాను తార్ నాకా అని పిలిచేవారు. కాలక్రమంలో అది తార్నాకగా మారింది.

**25. శాలిబండ :** శాలిబండ అసలు పేరు షా-అలీ-బండ. అప్పట్లో షా అలీ అనే ఒక సూఫీ యోగి పెద్ద బండ నివసించేవాడు. ఆయన పేరు మీదనే ఆ ఏరియాను షా అలీ బండ అని పిలిచేవారు.. కాలక్రమంలో అది శాలిబండగా మారింది

**26. హబ్సిగూడ :** నిజాం అశ్వికదళంలో అబ్సీనియన్స్ అనే నీగ్రోజాతి ప్రత్యేకంగా ఉండేది. వాళ్లంతా తార్నాక దాటిన తర్వాత డేరాలు వేసుకుని ఉండేవాళ్లు. అబ్సీనియన్స్ ఉండేవాళ్లు కాబట్టి ఆ ఏరియాను పిలుస్తున్నారు.

**27. మదీనా :** ధర్మదాత ఖాన్ బహద్దూర్ అల్లావుద్దీన్ 1900 సంవత్సరంలో నిర్మించిన మూడంతస్తుల భవనంవల్ల ఈ ప్రాంతానికి మదీనా అనే పేరు వచ్చింది.

**28. చిక్కడపల్లి :** చిక్కడపల్లి అసలు పేరు చిక్కడ్-పల్లి. చిక్కడ్ అంటే మారాఠీలో బురద. ట్యాంక్ బండ్పరీవాహక ప్రాంతం కావడంతో ఆ ఏరియాలో అప్పట్లో మోకాళ్లోతు బురద ఉండేది! బురద ఉన్న ప్రదేశం కాబట్టి చిక్కడ్పల్లి అని పిలిచేవారు. కాలక్రమంలో చిక్కడపల్లిగా మారిపోయింది.

**29. నౌబత్ పహాడ్ :** నిజాం కాలంలో నౌబత్ పహాడ్‌పై నగారాలు మోగించి ప్రజలకు ఫర్మానా చదివి వినిపించేవారు. నౌబత్ అంటే డోలు. పహాడ్ అంటే గుట్ట. నగారాలు మోగించి ఫర్మానాలు చదివి వినిపించే గుట్ట కాబట్టి దానికి నౌబత్ పహాడ్ అని పేరొచ్చింది.

**30. బాగ్‌లింగంపల్లి :** గోల్కొండ సుల్తాన్ అబ్దుల్లా ఖుతుబ్షా మార్నింగ్ వాక్ చేయడానికి టాంక్ బండ్ పరీవాహక ప్రాంతంలో పెద్ద ఉద్యానవనాన్ని నిర్మించారు. బాగ్ ఉండటం వల్ల ఆ ఏరియాను బాగ్‌లింగంపల్లి అంటున్నారు.

**31. అడిక్‌మెట్ :** అడిక్‌మెట్ అసలు పేరు అధికమెట్టు. ఎత్తైన ప్రాంతం కాబట్టి అధిక మెట్టు అని పిలిచేవారు. కాలక్రమంలో అడిక్ మెట్ గా



మారిపోయింది.

**32. మీరాలంమండి :** సికిందర్ ఝా హయాంలో పనిచేసిన మీర్ ఆలం అనే మంత్రి స్మారకార్థం తవ్వించిందే మీరాలం చెరువు. అక్కడే కూరగాయలతోట కూడా ఉండేది. దాన్ని మీరాలంమండి అనేవారు. ఇప్పటికీ మీరాలంమండి మార్కెట్ ఫేమస్!

**33. బార్కాస్ :** నిజాం సైన్యంలో అరేబియన్ పటాలం ప్రత్యేకంగా ఉండేది. వాళ్లంతా చాంద్రాయణగుట్ట దాటిన తర్వాత బ్యారెక్స్ వేసుకుని ఉండేవారు. ఆ ఏరియానే ఇప్పుడు బార్కాస్‌అని పిలుస్తున్నారు.

**34. తాడబండ్ :** తాడబండ్ అసలు పేరు తాడ్- బన్! తాటి చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల అలా పిలిచేవారు. కాలక్రమంలో తాడ్ బండ్‌గా మారిపోయింది.

**35. ఎర్రమంజిల్ :** ఇర్రంమంజిల్ ప్యాలెస్ ఉన్నందుకు ఆ ప్రాంతం ఎర్రమంజిల్ గా స్థిరపడింది.ఆరో నిజాం కాలంలో ఆ ప్యాలెస్‌ని రాయల్ బాంక్వెట్ హాల్ గా వాడేవారు.

**36. కాచిగూడ :** కచ్ అనే తెగ నివసించే ఏరియా కాబట్టి కాచిగూడ అనే పేరొచ్చింది.

**37. లాడ్ బజార్ :** మహ్మద్ ఖులీకుతుబ్ షా భాగమతిలకు మగసంతానం లేకపోవడంతో కూతురు హయత్ భక్షీ బేగంను గారాబంగా పెంచారు. ఆమెను ముద్దుగా లాడ్లీ అని పిలిచేవారు. చార్మినార్ పక్కన లాడ్ బజార్ లాడ్లీ అనే పేరుమీదనే స్థిరపడింది.

**38. ముషీరాబాద్ :** హుస్సేన్ సాగర్ కు తూర్పున కొంత భూమిని ముషీ-రుల్-ముల్క్ అనే నవాబ్ కు రెండో నిజామ్ కానుకగా ఇచ్చాడు. 1785లో ఆ ప్రాంతంలో ఒక ప్యాలెస్, గార్డెన్ నిర్మించాడు. ముషీ-రుల్-ముల్క్ పేరు మీద ఆ ప్రాంతం ముషీరాబాద్ గా స్థిరపడిపోయింది.

**39. ఫతే మైదాన్ :** ఔరంగజేబు గోల్కొండ కోటను ముట్టడించే టైంలో సైన్యంతో ఒకచోట బస చేశాడు. ఆ ప్రాంతాన్ని ఫతే మైదాన్ అని పిలిచేవారు. ఫతే అంటే విజయం, మైదాన్ అంటే గ్రౌండ్! ఇప్పుడక్కడ ఎల్బీ స్టేడియం నిర్మించారు.

**40. పబ్లిక్ గార్డెన్స్ :** పబ్లిక్ గార్డెన్స్ ఒకప్పుడు బాగ్-ఏ-ఆమ్ అని పిలిచేవారు: బాగ్ అంటే తోట, ఆమ్ అంటే ప్రజలు! ప్రజల కోసం నిర్మించింది కాబట్టి బాగ్-ఏ-ఆమ్ అన్నారు. ఇంగ్లీష్ లో పోష్‌గా పబ్లిక్ గార్డెన్స్ అని పిలుస్తున్నారు.

**41. చాదర్ ఘాట్ :** మూసీ నుంచి డ్యామ్ లోకి ప్రవహించే నీరు పై నుంచి చూస్తే చాదర్ లా కనిపించేదట. అందుకే ఆ ఏరియాకు చాదర్ ఘాట్ అని పేరొచ్చింది.

**42. ఆస్మాన్ గఢ్ :** 1887-92 వరకు హైదరాబాద్ ప్రైమ్ మినిస్టర్ గా పనిచేసిన నవాబ్ ఆస్మాన్ ఝా బహద్దూర్ పేరు మీద ఆస్మాన్ గఢ్ ఏర్పడింది.

**43. ఉమ్దా బజార్ :** నవాబ్ నిజాం ఆలీ ఖాన్ తల్లి ఉమ్దా బేగం పేరు మీద ఉమ్దా బజార్ ఏర్పడింది. హుస్సేని ఆలంకు ఒక మైలు దూరంలో ఈ ఏరియా ఉంటుంది. ఆసఫ్ జాహీల కాలంలో ఉమ్దా బజార్ షాపింగ్ సెంటర్గా ప్రసిద్ధిగాంచింది.

**44. గౌలిగూడ :** గౌలీ అంటే గొర్రెల కాపరి! వాళ్లంతా ఎక్కువగా ఉండేవాళ్లు కాబట్టి ఆ ప్రాంతం గౌలిగూడగా స్థిరపడిపోయింది.

**45. లల్లాగూడ :** రెండో నిజాం నవాబ్ అలీ ఖాన్ తన భార్య తహ్నియత్ ఉన్నిసా బేగం కోసం మౌలాలీ సమీపంలో ఒక ప్యాలెస్, ఉద్యానవనాన్ని నిర్మించాడు. లల్లా అనే ఆర్కిటెక్ట్ ప్యాలెస్ నిర్మాణానికి ప్లాన్ గీసినందుకు ఆ ఏరియాను లల్లాగూడ అని పిలిచారు. తర్వాత కాలంలో లాలాగూడగా మారింది.

**46. సుల్తాన్ బజార్ :** 1933కంటే ముందు బ్రిటిష్ ఏలుబడిలో ఉన్నందుకు బడేచౌడి ప్రాంతాన్ని రెసిడెన్సీ బజార్ అని వ్యవహరించేవారు. ఏడో నిజాం అధికారంలోకి వచ్చాక, ఆ ఏరియాని సుల్తాన్ బజార్ అని మార్చేశారు.

**47. రికాబ్ గంజ్ :** రికాబ్ గంజ్ ని మొదట్లో గంజ్ రికాబ్ అని పిలిచేవారు. తర్వాతి క్రమంలో రికాబ్ గంజ్‌గా మారింది. రికాబ్ అనేది ఒక కంపెనీ పేరు. గంజ్ అంటే హోల్ సేల్ షాపింగ్ కాంప్లెక్స్! మొఘలుల కాలంలో ఆ ఏరియాలో మిలటరీ ఆఫీసర్లు ఉండేవారు.

**48. దబీర్ పురా :** నిజాం కాలంలో మినిస్టర్ల క్వార్టర్లన్నీ దబీర్ పురాలో ఉండేవి! దబీర్ అంటే పండితుడు అని అర్థం. ఇంటెలెక్చువల్స్ అంతా ఉండే ఏరియా కాబట్టి దానికా పేరొచ్చింది.

**49. అంబర్ పేట :** అంబర్ అంటే ఉర్దూలో మేఘాలు అని అర్థం. పేట అంటే కాలనీ. మూసీ పరీవాహక ప్రాంతంలో ఆ ఏరియా ఎప్పుడూ మేఘావృతమై ఉండేది. దాంతో అది అంబర్ పేటగా స్థిరపడిపోయింది.

**50. చాంద్రాయణగుట్ట :** చెన్నకేశవ స్వామి ఆలయం ఉన్న ఆ ప్రాంతాన్ని ఒకప్పుడు చెన్నరాయుడి గుట్టగా పిలిచేవారు. కాలక్రమంలో అది చాంద్రాయణగుట్టగా మారిపోయింది.

**51. చిలకలగూడ :** చిలకలు ఎక్కువగా ఉండేవి కాబట్టి చిలకలగూడకు ఆ పేరొచ్చింది. సాయంత్రం కాగానే పక్కనే ఉన్న సీతాఫల్ మండి మార్కెట్ మీద గుంపులుగుంపులుగా వచ్చి వాలి పళ్లు తిని వెళ్లేవి!

**52. మంగళ్ హాట్ :** మంగళ్ హాట్ అసలు పేరు మంగళ్ హత్! మంగళ్ అంటే మంగళవారం. హత్ అంటే సంత. ప్రతి మంగళవారం అక్కడ సంత జరుగుతుంది కాబట్టి ఆ ప్రాంతాన్ని మంగళ్ హత్ అనే పిలిచేవారు. కాలక్రమంలో మంగళ్‌హాట్‌గా మారిపోయింది.

**53. సైదాబాద్ :** 1591లో గోల్కొండ రాజ్యానికి ప్రధానిగా చేసిన సయ్యద్ మీర్ మోమిన్ పేరు మీద సైదాబాద్ ఏర్పడిందని ప్రచారంలో ఉంది. మొదట్లో సయ్యదాబాద్ అనేవారు. తర్వాత సైదాబాద్ అని పిలుస్తున్నారు.

**54. టప్పాచబుత్ర :** టప్పా అంటే ఉర్దూలో ఉత్తరం అని అర్థం. చబుత్ర అంటే గ్రామం. నిజాం కాలంలో ఆ ఏరియాలో పోస్టాఫీసు ఉండేవి. అక్కడి నుంచే సిటీ అంతా బట్వాడా జరిగేది. అందుకే ఆ ఏరియాని టప్పాచబుత్ర అని పిలుస్తున్నారు.

**55. తుకారాం గేట్ :** లాలాగూడ స్టేషన్ దాటిన తర్వాత ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర తుకారాం అనే గేట్ కీపర్ పనిచేసేవాడు. ఈస్ట్ మారేడుపల్లి, అడ్డగుట్ట నుంచి వచ్చేవాళ్లంతా గేట్ కీపర్ తుకారాం పేరునే లాండ్ మార్కుగా వాడుకునేవారు. అలా ఆ ప్రాంతం తుకారాంగేట్ గా మారిపోయింది.

**56. యాఖుత్ పురా :** హైదరాబాద్ కు చార్మినార్ గుండెకాయ అయితే, పాతబస్తీకి యాఖుత్పురా గుండెకాయ. యాఖుత్ అంటే నీలంరంగు రత్నం అని అర్థం. నిజాం రాజుకి పచ్చలంటే వల్లమాలిన అభిమానం. అందుకే ఆ ఏరియాకు యాఖుత్ పురా అని నవాబే నామకరణం చేశాడు.

**డాక్టర్.ఎస్. విజయ భాస్కర్.,**
**9290826988**

# సినిమా రివ్యూ

విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ నటించిన బాలీవుడ్ సౌత్ ఇండియన్ సినిమా 'మెర్రీ క్రిస్మస్'. అంటే ఈ సినిమాను హిందీ, తమిళ భాషల్లోనూ తెరకెక్కించారన్న మాట. దాన్ని తెలుగులోకి కూడా అదే పేరుతో డబ్ చేశారు. సంక్రాంతికి నెలకొన్న విపరీతమైన పోటీ, వివాదాల కారణంగా ఈ సినిమా విడుదల అవుతుందన్న సంగతే తెలుగు ప్రేక్షకుల్లో చాలా మందికి తెలియదు. 'బద్లాపూర్', 'అంధాధున్' లాంటి అవార్డు విన్నింగ్ థ్రిల్లర్ సినిమాలు తీసిన శ్రీరామ్ రాఘవన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. మరి 'మెర్రీ క్రిస్మస్' ఎలా ఉంది?

కథ:
ఆల్బర్ట్ (విజయ్ సేతుపతి) క్రిస్మస్ ముందు రోజు రాత్రి ఏడు సంవత్సరాల తర్వాత బొంబేకు తిరిగి వస్తాడు. తన తల్లి చనిపోయిన సంగతి ఇంటి పక్కన ఉండే వ్యక్తి (టీనూ ఆనంద్) చెప్తాడు. అదే రోజు ఒక రెస్టారెంట్‌లో భోజనం చేయడానికి వెళ్తాడు. అక్కడికి మరియా (కత్రినా కైఫ్) తన కూతురితో కలిసి వస్తుంది. ఆమె ఎవరిని అయితే డేట్‌కు తీసుకెళ్లడం కోసం వస్తుందో అతను మరియా బిడ్డను చూసి డేట్ మధ్యలో వదిలేసి వెళ్లిపోతాడు. ఆల్బర్ట్ అక్కడి నుంచి సినిమాకు వెళ్లిపోతాడు. మరియా కూడా అనుకోకుండా అదే సినిమాకు వెళ్తుంది. అక్కడ ఇద్దరికీ పరిచయం ఏర్పడుతుంది. ఆల్బర్ట్‌కు ఎవరూ లేరని తెలిసి క్రిస్మస్ సెలబ్రేషన్స్‌కు మరియా తన ఇంటికి ఆహ్వానిస్తుంది. ఆల్బర్ట్, మరియా మధ్యలో ఒకసారి బయటకు వెళ్లి వచ్చే సరికి మరియా భర్త హాల్లో చనిపోయి ఉంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? మరియా భర్తను ఎవరు చంపారు? ఎందుకు చంపారు? ఆల్బర్ట్ గతం ఏంటి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ: ప్రేక్షకుల ఊహలకు, అంచనాలకు ఏమాత్రం అందకుండా కథను నడపటం శ్రీరామ్ రాఘవన్ స్పెషాలిటీ. ఇప్పటివరకు శ్రీరామ్ రాఘవన్ తీసిన సినిమాల్లో స్టోరీ లైన్ చిన్నదే అయినా ట్రీట్‌మెంట్‌తో దాన్ని సమ్‌థింగ్ స్పెషల్ మారుస్తారు ఆయన. 'మెర్రీ క్రిస్మస్' కూడా ఆ కోవలోకే వెళ్తుంది. స్టోరీ పరంగా 'మెర్రీ క్రిస్మస్' లైన్ చాలా చిన్నది. కానీ మేకింగ్‌లోనే శ్రీరాం రాఘవన్ మ్యాజిక్ కనిపిస్తుంది. సినిమా ప్రారంభం అయిన దగ్గర నుంచి కథ నడిచే తీరు, పాత్రల ప్రవర్తన ప్రేక్షకుడి ఆలోచనని ఒకవైపు తీసుకెళ్తుంది. కానీ నిజానికి స్క్రీన్‌పై జరిగే కథ వేరుగా ఉంటుంది. ప్రథమార్థంలో చాలా వరకు విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్‌ల కెమిస్ట్రీ మీదనే సాగుతుంది. ఇంటర్వల్ నుంచి అసలు కథ ప్రారంభం అవుతుంది. ఫస్టాఫ్ కాస్త స్లోగా సాగినప్పటికీ ఎక్కడా బోర్ కొట్టదు. సెకండాఫ్ మాత్రం చాలా గ్రిప్పింగ్‌గా ఉంది. ఈ సినిమా గురించి ఏం చెప్పాలన్నా అది కచ్చితంగా స్పాయిలరే



అవుతుంది. ఎక్కువ రివీల్ చేయకుండా స్క్రీన్‌ప్లే గురించి చెప్పాలంటే మాత్రం విజయ్ సేతుపతి... కత్రినా కైఫ్ ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు 'అసలేం జరిగింది? ఏం జరుగుతుంది? ఏం జరగబోతుంది?' అనే ఆసక్తి కలుగుతుంది. కత్రినా ఇంటికి విజయ్ రెండో సారి వచ్చినప్పుడు 'ఇదేందయ్యా ఇది? ఇది నేనెప్పుడూ చూడలా' అనిపిస్తుంది. అలా స్క్రీన్ మీద లీడ్ యాక్టర్స్ ఏ ఎమోషన్ అయితే ఫీల్ అవుతారో... ఆడియన్స్ కూడా అదే ఎమోషన్, థ్రిల్ ఫీలవుతారు.

'మెర్రీ క్రిస్మస్' స్క్రీన్‌ప్లే, క్యారెక్టర్ డిజైన్‌లో ఉన్న మరో ప్లస్ పాయింట్ ఏంటంటే విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్ సరదాగా కూర్చుని మాట్లాడుకుంటున్నా చూసేవాళ్లందరికీ 'ఏదో తేడాగా ఉందే' ... వెనక ఏదో ఉంది అనిపిస్తుంది. సాధారణంగా థ్రిల్లర్లలో అలా అనిపిస్తే రైటింగ్‌లో లోపాలున్నట్లు అనుకోవాలి. కానీ ఇక్కడ మాత్రం అది రైటింగ్‌లో ఉన్న లోపం కాదు బ్రిలియన్స్. విజయ్, కత్రినాలు మాట్లాడుకునే ప్రతి మాటలో ఒక నిగూఢార్థం ఉంటుంది. కొన్ని సీన్లలో నోటి నుంచి వచ్చే మాటకి, కళ్లలో పలికే ఎక్స్‌ప్రెషన్‌కు సంబంధం ఉండదు. ఒక సీన్‌లో విజయ్ సేతుపతి 'ఈ మూడు గంటలూ హాయిగా ఒక సినిమా చూసినట్లు ఉంది. ఒక కలలా ఉంది. అలారం నన్ను లేపకముందే నేను వెళ్లిపోవాలి.' అని వెళ్లిపోతాడు. కానీ అక్కడ విజయ్ సేతుపతి వెళ్లడని ముందు కూర్చుని చూసే ఆడియన్స్‌కు కూడా అర్థం అవుతుంది. కానీ అది ప్రిడిక్టబుల్ సీన్ అనిపించదు. అదే మ్యాజిక్కు.

సినిమా క్లైమ్యాక్స్ విషయంలో మాత్రం కాస్త మిశ్రమ స్పందన వచ్చే అవకాశం ఉంది. 'అంధాధున్' తరహా ఓపెన్ ఎండింగ్ క్లైమ్యాక్స్ నచ్చేవారికి ఈ సినిమాతో ఎటువంటి ప్రాబ్లం ఉండదు. కానీ ప్రాపర్ ఎండింగ్ దర్శకుడే ఇవ్వాలని కోరుకునే ప్రేక్షకులకు మాత్రం మధ్యలో వదిలేసినట్లు అనిపిస్తుంది. టెక్నికల్‌గా కూడా 'మెర్రీ క్రిస్మస్'ను ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా తెరకెక్కించారు. మొదటిగా సినిమాటోగ్రఫీ గురించి మాట్లాడుకుంటే ఇదొక రెట్రో సినిమా అని తెలుస్తుంది కానీ ఏ కాలంలో జరిగే కథ అనేది ప్రేక్షకుడి ఊహకు కూడా అందకుండా జాగ్రత్తగా పడ్డారు. ఒకే థియేటర్లో 1940లో, 1978లో విడుదల అయిన హాలీవుడ్ సినిమాలు ఆడుతూ ఉంటాయి. సినిమాలో ఎక్కడా ఒక క్యాలెండర్ కూడా కనిపించదు. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా చాలా కొత్తగా ఉంది. 1940, 1950ల కాలం నాటి హాలీవుడ్ థ్రిల్లర్స్‌లో వచ్చే తరహా మ్యూజిక్‌ను ఇందులో వినవచ్చు. ముఖ్యంగా క్లైమ్యాక్స్‌లో ఒకే పిచ్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అంతే సూపర్బ్. సెట్ వర్క్ కూడా అద్భుతంగా ఉంది. కత్రినా కైఫ్ ఇంటి సెట్ ఒక రెట్రో హౌస్‌ను తలపిస్తుంది. షాట్ డివిజన్ కూడా చాలా బాగా చేశారు. లెంతీ షాట్లు కూడా చాలా ఎఫెక్టివ్‌గా తీశారు.

ఇక నటీనటుల విషయానికి వస్తే...
విజయ్ సేతుపతి, కత్రినా కైఫ్‌ల మధ్య కెమిస్ట్రీనే సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్. తమ పెర్ఫార్మెన్స్‌లతో సినిమాను వేరే లెవల్‌కు తీసుకువెళ్లారు. విజయ్ సేతుపతిని ఇటీవలి కాలంలో ఇలాంటి పాత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎంతో డెప్త్ ఉన్న ఆల్బర్ట్ పాత్రకు తానే పర్‌ఫెక్ట్ ఛాయిస్ అనే రేంజ్‌లో పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. విజయ్ సేతుపతి టైమింగ్, పంచ్‌లు హైలైట్. ఇటీవలి కాలంలో అవుట్ అండ్ అవుట్ కామెడీ సినిమాల్లో కూడా ఇంత ఆర్గానిక్ కామెడీ చూడలేదు. సినిమాలో కత్రినా కైఫ్ సర్‌ప్రైజ్ ప్యాకేజ్. కత్రినాకు నటన సరిగ్గా రాదు అనే అపవాదు ఉండేది. కానీ 'మెర్రీ క్రిస్మస్'లో పూర్తిగా కొత్త కత్రినాను చూడవచ్చు. తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇదే అని చెప్పవచ్చు. మిగతా పాత్రధారులందరూ తమ పాత్రల పరిధి మేర నటించారు.


ఓవరాల్‌గా చెప్పాలంటే...
థ్రిల్లర్ లవర్స్ కచ్చితంగా చూడాల్సిన సినిమా 'మెర్రీ క్రిస్మస్'. శ్రీరాం రాఘవన్ తన మార్కు ఎక్కడా మిస్ కాకుండా టాప్ క్లాస్ రొమాంటిక్ థ్రిల్లర్.

---

సిద్ధార్థ్ మల్హోత్రా నటించిన ఫస్ట్ వెబ్ సిరీస్ 'ఇండియన్ పోలీస్ ఫోర్స్'. కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌కు కేరాఫ్ అడ్రస్ లాంటి బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి దీనికి క్రియేటర్. సుష్వంత్ ప్రకాష్‌తో కలిసి దర్శకత్వం వహించారు. ఇందులో శిల్పా శెట్టి, వివేక్ ఒబెరాయ్, నికితిన్ ధీర్ (కంచె ఫేమ్), ముఖేష్ రుషి, శరద్ కేల్కర్ (సర్దార్ గబ్బర్ సింగ్ ఫేమ్), మయాంక్ టాండన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ ఎలా ఉంది? 'గోల్‌మాల్', 'సింగమ్' సిరీస్, 'సింబ', 'సూర్యవంశీ' చిత్రాలతో భారీ విజయాలు అందుకున్న రోహిత్ శెట్టి... 'ఇండియన్ పోలీస్ ఫోర్స్'తో ఓటీటీలో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చారా? లేదా? అనేది రివ్యూలో చూద్దాం.

కథ:
ఢిల్లీలో వరుస బాంబు పేలుళ్లు జరుగుతాయి. వాటికి ఇండియన్ ముజాహిద్దీన్ బాధ్యత వహిస్తుంది. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఫోర్స్ కమిషనర్ విక్రమ్ బక్షి (వివేక్ ఒబెరాయ్), డిప్యూటీ కమిషనర్ కబీర్ మాలిక్ (సిద్ధార్థ్ మల్హోత్రా) తీవ్రవాదుల్ని పట్టుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెడతారు. గుజరాత్ ఏటీఎస్ తారా శెట్టి (శిల్పా శెట్టి) ఢిల్లీ పోలీసులకు తోడవుతుంది. చేతికి చిక్కినట్టే చిక్కిన తీవ్రవాది తప్పించుకుంటాడు. ఆ తర్వాత జైపూర్, గోవాలో పేలుళ్లు జరుగుతాయి. అన్నిటికీ సూత్రధారి ఒక్కడే. ఆ తీవ్రవాదిని పోలీసులు పట్టుకున్నారా? లేదా? కబీర్ బంగ్లాదేశ్ ఎందుకు వెళ్లారు? జగ్‌తాప్ (శరద్ కేల్కర్) ఎటువంటి సాయం చేశాడు? జరార్ లేదా హైదర్ (మయాంక్ టాండన్) ఎవరు? అనేది సిరీస్ చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ:
రోహిత్ శెట్టి కథలు, హీరో క్యారెక్టర్లలో మాస్ ఆడియన్స్ చేత క్లాప్స్ కొట్టించే, విజిల్స్ వేయించే మూమెంట్స్ ఎక్కువ. 'సింగమ్'లో అజయ్ దేవగణ్, 'సింబ'లో రణ్‌వీర్ సింగ్, 'సూర్యవంశీ'లో అక్షయ్ కుమార్... హీరో ఎవరైనా స్లో మోషన్ షాట్స్ గ్యారంటీ. హీరోయిజం ఎలివేట్ చేయడంలో రోహిత్ శెట్టికి సపరేట్ స్టైల్ ఉంది. ఆ టేకింగ్, మేకింగ్ బాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర కోట్ల రూపాయల వసూళ్లు రాబట్టింది. అయితే... రోహిత్ శెట్టి సినిమాల్లో సౌత్ ఆడియన్స్‌కు కొత్తగా కనిపించే అంశాలు చాలా తక్కువ. మనం చూసేసిన కథలు, క్యారెక్టర్లను తెరపై చూస్తున్నట్టు ఉంటుంది. 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' కూడా అంతే!




కొత్తేముంది? అంతా రొటీన్ ఓల్డ్!
ఇండియాలో బాంబు పేలుళ్లు, తీవ్రవాదుల్ని పట్టుకోవడానికి పోలీసులు, ఆర్మీ, ఇంటెలిజెన్స్ చేసే ప్రయత్నాలు... ఈ పాయింట్ మీద వచ్చిన వెబ్ సిరీస్ లేదా సినిమాలు కోకొల్లలు. 26/11 టెర్రర్ ఎటాక్స్ బేస్ చేసుకుని వచ్చినవి ఓటీటీల్లో చాలా ఉన్నాయి. వాటితో పోలిస్తే... 'ఇండియన్ పోలీస్ ఫోర్స్'లో కించిత్ కొత్తదనం లేదు. సేమ్ ఓల్డ్ రొటీన్ స్టోరీ, స్క్రీన్ ప్లే, ట్విస్ట్! లాస్ట్ ఎపిసోడ్ చూస్తున్నంత సేపూ తెలుగు ప్రేక్షకులకు అడివి శేష్ 'గూఢచారి', అక్కినేని నాగార్జున 'వైల్డ్ డాగ్' సినిమాలు గుర్తొస్తే ఆశ్చర్యం లేదు.

కథ పక్కన పెడితే... క్యారెక్టర్లలోనూ కొత్తదనం లేదు. ముస్లింలకు అన్యాయం జరుగుతుందని ఆ మతానికి చెందిన యువకులు తీవ్రవాదం వైపు ఆకర్షితులై దేశం మీద దాడులకు పాల్పడటం, దేశంపై ప్రేమతో ప్రాణత్యాగానికి సిద్ధపడిన ముస్లిం పోలీస్ లేదా ఆర్మీలో చేరడం... వెబ్ సిరీస్ లేదా సినిమాల్లో చూస్తూనే ఉన్నాం. రోహిత్ శెట్టి అండ్ టీమ్ మరోసారి ఆ క్యారెక్టర్లను తీసుకుని సిరీస్ చేశారు.

గ్లోబ్ ట్రాటింగ్... హాలీవుడ్ తరహాలో!
గ్లోబ్ ట్రాటింగ్... మహేష్ బాబు, రాజమౌళి సినిమా కారణంగా ఈ జానర్ ఏమిటో తెలుగు ప్రేక్షకులకు సైతం తెలిసింది. 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' సైతం గ్లోబ్ ట్రాటింగ్ వెబ్ సిరీస్. ఇండియాలో వివిధ లొకేషన్లలో కథ జరిగింది. చివరకు బంగ్లాదేశ్ కూడా వెళ్లింది. అయితే... ఏ దశలోనూ సిరీస్ ఆసక్తి కలిగించలేదు. డ్రోన్ / ఏరియల్ వ్యూ షాట్స్ తీయడానికి దర్శకులకు అవకాశం లభించిందంతే. ఆ షాట్స్ కొంచెం కొత్తగా ఉన్నాయి.

అయితే... కథలో ఎమోషన్స్ వర్కవుట్ కాలేదు. క్యూరియాసిటీ క్రియేట్ చేయలేదు. ఎంత సేపటికీ ముందుకు కదలని కథ, నిడివి వీక్షకులను టీవీ / ల్యాప్ టాప్ స్క్రీన్స్ ముందు కూర్చోవడానికి ఇబ్బంది పెడతాయి. కొన్ని సీన్లు సిల్లీగా తీశారు. సినిమాల్లో కమర్షియాలిటీ ఓకే. అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో టెర్రరిస్ట్ బేస్డ్ వెబ్ సిరీస్ 'ఫ్యామిలీ మ్యాన్'తో కంపేర్ చేస్తే... తీవ్రవాదుల్ని పట్టుకోవడానికి వెళ్లే ఆఫీసర్లు ఎలా ఉంటారు? అనే విషయంలో రోహిత్ శెట్టి అండ్ కో మినిమమ్ రీసెర్చ్ చేయలేదని అర్థం అవుతుంది. కమర్షియల్ టచ్ ఇవ్వడానికి ట్రై చేశారు తప్ప లాజిక్స్ పట్టించుకోలేదు.

యాక్షన్ సీక్వెన్సుల్లో రోహిత్ శెట్టి మార్క్
రోడ్డు మీద భారీ ఛేజింగ్స్, గాల్లోకి లేచే కార్లు... రోహిత్ శెట్టి సినిమాల్లోని యాక్షన్ సీక్వెన్సుల్లో తప్పకుండా కనిపిస్తాయి. 'ఇండియన్ పోలీస్ ఫోర్స్'లోనూ ఆ తరహా సీన్లు ఉన్నాయి. శెట్టి అభిమానులను అవి మెప్పించవచ్చు. మిగతా వాళ్లకు కష్టమే. టెక్నికల్ పరంగా చూసినా ఆకట్టుకునే అంశాలు పెద్దగా లేవు. రోహిత్ శెట్టి కథ, దర్శకత్వంలో హీరోయిజాన్ని ఎలివేట్ చేసేలా నేపథ్య సంగీతం లేదు. తెలుగు డబ్బింగ్, డైలాగ్స్ విషయంలో చాలా కేర్ తీసుకున్నారు.

విలన్ మయాంక్ టాండన్ నచ్చుతాడు!
సిద్ధార్థ్ మల్హోత్రా, వివేక్ ఒబెరాయ్ క్యారెక్టర్లు రెగ్యులర్ రోహిత్ శెట్టి సినిమాల్లో హీరోల తరహాలో ఉన్నాయి. లేడీ పోలీస్ ఆఫీసర్ శిల్పా శెట్టి రోల్ కూడా అంతే! తమ తమ పాత్రల పరిధి మేరకు వాళ్లు నటించారు. సిద్ధార్థ్ భార్యగా ఇషా తల్వార్, వివేక్ భార్యగా శ్వేతా తివారి పాత్రలు పరిమితమే. తెలుగు ప్రేక్షకులకు తెలిసిన నటుడు ముఖేష్ రుషి కీలక పాత్రలో కనిపించారు. నటీనటులు అందరిలో విలన్ రోల్ చేసిన మయాంక్ టాండన్ మెజారిటీ ప్రేక్షకులకు నచ్చుతాడు. అతను బాగా నటించాడు.

ఓటీటీ కోసం రోహిత్ శెట్టి కొత్తగా ప్రయత్నించలేదు. తమ టీంతో తనకు అలవాటైన రీతిలో వెబ్ సిరీస్ తీశారు. కథ, కథనం, క్యారెక్టర్లలో కొత్తదనం లేదు. అయితే... తన నుంచి అభిమానులు ఆశించే మాస్, కమర్షియల్ ఎలిమెంట్స్ కొన్ని అందించారు. బహుశా... థియేటర్లలో అయితే విజిల్స్ పడతాయేమో!? 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' ఓటీటీ రిలీజ్ కదా... చిన్న స్క్రీన్ మీద ఆడియన్స్ రిసీవ్ చేసుకోవడం, ఎంజాయ్ చేయడం కష్టమే!

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com




# 21.1.2024 నుంచి 27.1.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోయదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలుమాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. దూర ప్రయాణాల కొరకు ప్రణాళికలు వేసుకుంటారు. వ్యక్తుల సహకారం పెరుగుతుంది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆరోగ్యం బాగుంటుంది. శారీరక శ్రద్ధ, అలంకరణ మీద ఆసక్తి పెరుగుతాయి. ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. దూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఇతరులకు రుణములు ఇస్తారు. సంతానపరమైన అంశములలో అభివృద్ధికి సంబంధించిన విషయాలు ఆలోచన రేకెత్తి స్థాయి. గృహ ఆదాయం బాగుంటుంది. తల్లి తరపు బంధువుల నుంచి రాకపోకలుంటాయి. బహుమానములు అందుకుంటారు. నూతన వాహన కొనుగోలు కొరకు తోబుట్టువులతో సంప్రదిస్తారు.



## మిథున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభం ఆధ్యాత్మిక ఆలోచనలలో, గురువుల ఆశీస్సులతో కలయికలతో ఉంటారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. దూర ప్రయాణములలో కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశములు మీద దృష్టి పెడతారు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

ప్రారంభం ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఆత్మీయ శ్రేయోభిలాషులైన స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. సంతోషంగా శుభవార్తలతో వృత్తిపరమైన అభివృద్ధితో, మొదలవుతుంది. దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు. వృత్తిలో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి. మధ్యలో పుణ్య క్షేత్ర సందర్శనతో, నదీ స్నానాలు, గురువులను కలవడం వారి ఆశీస్సులు తీసుకోవడం, కొత్త ప్రదేశాలకు విరాళాలు ఇవ్వడం. సమయానికి నిద్ర, ఆహార స్వీకరణ అవసరం. నూతన విషయాలు తెలుసుకుంటారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. సమయమునకు తగిన విశ్రాంతి ఆహారము అవసరము. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు నూతన విషయాలు నేర్చుకుంటారు. వ్యవసాయ సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. తోబుట్టువులతో నిదానమవసరం. మధ్యలో భాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి. దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు. అనుకోని ఒక వార్త ఘర్షణతో కూడిన ఆలోచన ఇస్తుంది. మిత్రులతో సన్నిహితులతో కలిసి చర్చిస్తారు. ఆత్మీయుల సహకారంతో కోరుకున్న పనులు సాగుతాయి.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభం సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి.విద్యాపరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. పెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు. ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధైర్యాన్ని ఇస్తుంది. విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకుఅనుకూలంగాఉంది.అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవిసంతోషాన్ని, ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. వారం మధ్యలో వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నూతన గృహ వాహన కొనుగోలు అంశములలో ఆచితూచి అడుగు వేయాలి. వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది.వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు


వారం ప్రారంభంలో వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనం త వరకూ మౌనం పాటించట మేలు. వారం మధ్యలో గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది. భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. వారం చివరిలో ఆత్మీయ మిత్రుల సహకారాన్ని కోరుకుంటారు. ఖరీదైన వాహన కొనుగోలు కొరకు చేయు ప్రయత్నాలు ముందుకు వెళతాయి.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ట 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగ నిరోధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. కుటుంబ వ్యక్తుల కలయిక ఆహ్లాదకరంగా ఉంటుంది ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. మధ్యలో మాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో వస్తువులు జాగ్రత్తగా పెట్టుకోవాలి, కొత్త వ్యక్తులన్నీ తొందరపాటు గా నమ్మడంలో జాగ్రత్త అవసరం. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి, సృజనాత్మకత బాగుంటుంది. అనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి. ఇంతకు ముందు రుణములు తీసుకున్న వారు చెల్లిస్తారు. సంతానముతో, ఆత్మీయ వ్యక్తుల తో ఆహ్లాదకరంగా గడుపుతారు. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వారం మధ్యలో వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాగ్వాదములకు దూరంగా ఉండాలి. భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

ప్రారంభం ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. సంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధు మిత్రులతో ప్రారంభమవుతుంది. గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామ్ కి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి. వారం మధ్యలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వ రుణాలు చెల్లిస్తారు, బంధు మిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు. గుర్తింపు గౌరవం శ్రమకు తగ్గిన ప్రతిఫలాన్ని పొందుతారు.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువులకు నూతన అవకాశములు కొరకు మీ సహకారం ఉంటుంది. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతోఅనుకూలం. కుటుం బములోని స్త్రీల ఆరోగ్య, ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది. వారం మధ్యలోవిదేశీ ప్రయత్నాలు చేస్తారు. ఉపా సన బలాన్ని పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి. స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి.అధిక శ్రమ బాధ్యతలు ఉన్నప్పటికీ గుర్తింపు గౌరవాన్ని పెంచుకుంటారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నాలు అధికం చేస్తారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. ఆదాయము అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు.మిత్రుల ల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది. వారము మధ్యలోవిద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. గృహవాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు. దానివలన వృత్తిపరమైన అలసట, అనారోగ్య భావనలు.


కీర్తి సురేష్